

కృష్ణా యూనివర్సిటీలో భవనాల నిర్మాణం, పీజీ కోర్సుల్లో సీట్ల భర్తీ ప్రక్రియ ప్రహసనంగా మారింది. నిర్మాణపు అంచనాలు పెంచినా పనులు సాగడం లేదు. యూనివర్సిటీకి వీసీలు, రిజిస్ట్రార్‌లుగా ఎవరొచ్చినా పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉన్నాయి. ఏడాదిన్నర క్రితం భవన నిర్మాణాల అంచనాలు పెంచి పునాదుల దశలో ఉన్న భవనాలకు పనులు జరిగినట్లుగా కోట్లాది రూపాయల బిల్లులు చెల్లించినా కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. అయినా అధికారులు పెదవి విప్పడంలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలైనా పనులు మొదలు కావడంలేదు.



కృష్ణా యూనివర్సిటీలో పునాదుల దశను దాటని బాలికల వసతిగృహం నిర్మాణం

నిధులు ఘనం.. పనులు శూన్యం..!

కృష్ణా యూనివర్సిటీలో ముందుకు కదలని భవనాల నిర్మాణ పనులు

- అంచనాలు రూ.43,31 కోట్ల నుంచి రూ.51.19 కోట్లకు పెంచినా పనులు ఎక్కడివక్కడే
- రెండున్నరేళ్లుగా నిలిచిన వసతిగృహ భవనాల నిర్మాణం
- పత్తాలేని కాంట్రాక్టర్లు.. పట్టించుకోని అధికారులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణా యూనివర్సిటీ ప్రాంగణంలో బాలికలు, బాలుర వసతిగృహాలు, ఫార్మసీ కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల, క్యాంపస్ చుట్టూ ప్రహరీ, ప్రధాన ప్రవేశద్వారం, నూజివీడు పీజీ సెంటరులో అకడమిక్ బ్లాక్‌పై జీ+2, బాలికల వసతి గృహం కోసం రూ.43.31 కోట్లతో తొలుత అంచనాలు రూపొందించారు. వీటి నిర్మాణం ఆలస్యం కావడంతో ఏడాదిన్నరక్రితం ఈ అంచనాలను రూ.51.19 కోట్లకు పెంచుతూ యూనివర్సిటీ భవన నిర్మాణ కమిటీ తీర్మానం చేసింది. భవన నిర్మాణాల అంచనాలను రూ.7.88 కోట్లకుపైగా పెంచినా పనులు చేయకుండా నిలిపివేశారు. కాకినాడ జేఎన్‌టీయూ నుంచి రిజిస్ట్రార్, ఇన్‌చార్జి వీసీ కృష్ణా యూనివర్సిటీకి వచ్చారు. యూనివర్సిటీలో భవనాల నిర్మాణంపై దృష్టి సారించడం లేదని, కాంట్రాక్టర్లను పిలిచి పనులు ప్రారంభించాలని కూడా చెప్పడంలేదని అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది చెబుతున్నారు.

పునాదుల దశలోనే హాస్టల్ భవనాల నిర్మాణం

కృష్ణా యూనివర్సిటీ ప్రాంగణంలో బాలుర వసతిగృహానికి తొలుత రూ.8.69 కోట్లతో అంచనాలు రూపొందించి, ఈ మొత్తాన్ని రూ.5.49 కోట్లకు తగ్గించారు. రూ.2.22 కోట్లను బిల్లులుగా చెల్లించారు. బాలికల వసతిగృహానికి తొలుత రూ.8.69 కోట్లతో అంచనాలు రూపొందించారు. తరువాత రూ.14.62 కోట్లకు పెంచారు. ఇందులో రూ.2.99 కోట్లను బిల్లులుగా చెల్లించారు. రెండేళ్ల క్రితం ఈ రెండు వసతిగృహాల భవనాల నిర్మాణం ప్రారంభించినా పనులు నేటికీ పునాదుల దశ దాటలేదు. ఫార్మసీ కళాశాల భవనం నిర్మాణం అంచనాను రూ.6 కోట్ల నుంచి రూ.10.01 కోట్లకు పెంచి రూ.3.57 కోట్లు బిల్లులుగా చెల్లించారు. ఇంజనీరింగ్ కళాశాల భవనం భవన నిర్మాణ అంచనాలను రూ.6.20 కోట్ల నుంచి రూ.4.21 కోట్లకు తగ్గించారు. ఇందులో రూ.3.27 కోట్లను బిల్లులుగా చెల్లించారు. ఈ రెండు భవనాల నిర్మాణం ప్రస్తుతం నిలిచిపోయింది. ఫుడ్‌కోర్టు అంచనాలను రూ.1.50 కోట్ల నుంచి రూ.3.20 కోట్లకు పెంచగా ఈ భవనం ఒక్కటే పూర్తయ్యే దశలో ఉంది. యూనివర్సిటీ చుట్టూ ప్రహరీ నిర్మాణం కోసం రూ.3.02 కోట్లతో రూపొందించిన అంచనాలను రూ.4.80 కోట్లకు పెంచి రూ.1.06 కోట్లను బిల్లులుగా చెల్లించినా ఈ పనులు నిలిచిపోయాయి. ప్రధానగేటు, ఆర్చి నిర్మాణం అంచనాలను రూ.30 లక్షల నుంచి రూ.72 లక్షలకు పెంచినా పనులు పూర్తికాలేదు. నూజివీడు పీజీ సెంటరులో అకడమిక్ బ్లాక్ జీ+2 పద్ధతిలో భవనాల నిర్మాణ కోసం రూ.5.50 కోట్లతో రూపొందించిన అంచనాలను రూ.6.65 కోట్లకు పెంచారు. రూ.3.95 కోట్లను బిల్లులుగా చెల్లించారు. ఇక్కడి బాలికలవసతి గృహం ఫస్ట్‌ఫ్లోర్ నిర్మాణం కోసం రూ.1.10 కోట్ల నుంచి రూ.1.45 కోట్లకు పెంచారు. బాలికల వసతిగృహం పనులు 90 శాతం పూర్తయినా, మిగిలిన 10 శాతం పనులు చేయకుండా నిలిపివేశారు. దీంతో ఇక్కడ 200 మంది బాలికలకు వసతిగృహం అందుబాటులోకి రాని స్థితి.

భవనాలు నిర్మించాలని మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతి

కృష్ణా యూనివర్సిటీ, నూజివీడు పీజీ సెంటరులో భవనాల నిర్మాణం నిలిచిపోవడం, బాలురు, బాలికల వసతిగృహ భవనాలు లేకపోవడంతో ఇక్కడ విద్యార్థులు చేరకపోవడం తదితర అంశాలపై యూనివర్సిటీలో పనిచేసే అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఇటీవల ఉమ్మడి జిల్లాకు చెందిన శాసనసభ్యులు, మంత్రులకు వివరించారు. వసతిగృహాలు అందుబాటులోకి వస్తే విద్యార్థులు వివిధ కోర్సుల్లో చేరేందుకు అవకాశం ఉందని కూడా చెప్పారు. యూనివర్సిటీలో భవనాలు, వసతిగృహాల పనులు చేయకున్నా కాంట్రాక్టర్లకు అదనంగా బిల్లులు మంజూరు చేశారనే అంశాన్ని కూడా తెలియజేశారు. నిలిచిపోయిన భవనాల నిర్మాణం విషయంలో యూనివర్సిటీ అధికారులు, పాలకులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

కాంట్రాక్టు ముగిసింది.. అధికారులు మారారు

యూనివర్సిటీలో భవనాల నిర్మాణపనుల పర్యవేక్షణ కోసం ఏపీ డబ్ల్యూఐపీడీసీతో యూనివర్సిటీ అధికారులు గతంలో ఒప్పందం చేసుకున్నారు. భవనాల నిర్మాణ పనులు పర్యవేక్షించినందుకు పనుల విలువలో 4 శాతం, క్వాలిటీ కంట్రోల్ పనులను పర్యవేక్షించినందుకు 0.5 శాతం చార్జీల రూపంలో చెల్లించేలా 2022 డిసెంబరులో, 2023లో జనవరిలో రెండు విడతలుగా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ఈ ఏడాది జనవరితో ముగిసింది. ఇటీవల డబ్ల్యూఐపీడీసీ అధికారులతో యూనివర్సిటీ అధికారులు సమావేశం నిర్వహించారు. కాంట్రాక్టర్లతో పనులు చేయించాలని కోరారు. దీంతో డబ్ల్యూఐపీడీసీ అధికారులు తమ కాంట్రాక్టు ముగిసిందని, గతంలో పనిచేసిన అధికారులు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిపోయారని, ఈ పనులు పర్యవేక్షించాలంటే మళ్లీ ఒప్పందం చేసుకోవాలని చెప్పడం గమనించదగ్గ అంశం. యూనివర్సిటీలో చదివే విద్యార్థుల నుంచి ఫీజుల రూపంలో వసూలు చేసిన నగదును భవనాల నిర్మాణం కోసం కేటాయించడం మరీ దారుణం.

భర్తీ చేయాల్సిన సీట్లు 454.. భర్తీ అయినవి 148

కృష్ణాయూనివర్సిటీ, నూజివీడు పీజీ సెంటరులో వివిధ పీజీ కోర్సుల్లో 454 పీజీ సీట్లను భర్తీ చేసేందుకు ప్రభుత్వం 2024-25 విద్యా సంవత్సరంలో అనుమతులు ఇచ్చింది. ఎంఏ ఇంగ్లీష్, ఎంకాం, ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ అనలాటికల్ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ మేథమెటిక్స్, ఎమ్మెస్సీ ఫిజిక్స్, ఎమ్మెస్సీ బోటనీ, ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, ఎమ్మెస్సీ జువాలజీ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో మొదటి విడతగా 289 సీట్ల భర్తీకి అనుమతులు వచ్చాయి. ఇప్పటివరకు వివిధ పీజీ కోర్సుల్లో చేరేందుకు రిపోర్టు చేసిన విద్యార్థుల సంఖ్య 148గా ఉంది. మిగిలిన సీట్లు ఎంతమేర భర్తీ అవుతాయో తెలియనిస్థితి ఉందని ప్రొఫెసర్లు అంటున్నారు.

తర్వాత ఎవరో?



కాదంబరి కేసులో తాజాగా ముగ్గురు ఐపీఎస్‌లపై వేటు

- ఇప్పటికే ఏసీపీ, ఇన్‌స్పెక్టర్‌పై వేటు వేసిన అధికారులు
- కాదంబరి జాబితాలో మరో నలుగురు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ముంబై నటి కాదంబరి జెత్వాని కేసు పోలీసు శాఖను కుదిపేస్తోంది. నాడు వైసీపీ నేతల ఒత్తిళ్లతో ముందూ వెనుక చూసుకోకుండా వ్యవహరించిన పోలీసులు ఇప్పుడు ఆ పర్యవసానాలు చవిచూస్తున్నారు. కాదంబరి జెత్వాని ఇచ్చిన ఫిర్యాదుతో మొత్తం డొంక కదులుతోంది. కొద్దిరోజుల క్రితమే అప్పటి పశ్చిమ జోన్ ఏసీపీ కె.హనుమంతరావు, ఇబ్రహీంపట్నం ఇన్‌స్పెక్టర్ ఎం.సత్యనారాయణపై ఉన్నతాధికారులు వేటు వేశారు. ఇది జరిగిన రెండు రోజులకు కాదంబరి ఇచ్చిన ఫిర్యాదుపై ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇందులో వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్‌ను ఏ1గా చేర్చారు. అతడితోపాటు మరికొంతమంది అని ఎఫ్ఐఆర్‌లో రాశారు. ఈ ప్రక్రియ పూర్తికాగానే ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా, విశాల్‌గున్నీలను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. తర్వాతి వంతు ఎవరిదనే దానిపై పోలీసు వర్గాల్లో చర్చసాగుతోంది.

వాళ్లకు వేటు తప్పినట్టేనా?

కాదంబరి జెత్వాని కుటుంబాన్ని విచారణ పేరుతో హింసించిన పోలీసుల్లో కొందరు ధీమాను ప్రదర్శిస్తున్నారు. తమకు జోలికి ఉన్నతాధికారులు వచ్చే అవకాశం లేదని చెప్పుకుంటున్నారు. మొత్తం వ్యవహారానికి బాధ్యులను చేస్తూ ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా, విశాల్‌గున్నీలను సస్పెండ్ చేసినందున ఇక తమ వంతు ఉందని భావిస్తున్నారు. ఐపీఎస్‌లపై వేటు వేశారు కాబట్టి తమపై ఎలాంటి చర్యలూ ఉండబోవని సన్నిహితుల వద్ద చెప్పుకుంటున్నారు. కాదంబరి ఆరోపణల జాబితాలో ఉన్న అదనపు ఎస్పీ నాడు టాస్క్‌ఫోర్స్ విభాగంలో పనిచేశారు. ఒక ఇన్‌స్పెక్టర్ ఇదే విభాగంలో ఉండేవారు. మరో ఇన్‌స్పెక్టర్ కమిషనరేట్‌లో వ్యవహారాలను చక్కబెట్టేవారు. ఎస్ఐ మాత్రం మొత్తం కమిషనరేట్‌కు షాడోగా వ్యవహరించాడు. ఇటీవలే ఆయన్ను ఏలూరు రేంజ్‌కు సరెండర్ చేశారు. అక్కడి నుంచి కృష్ణా జిల్లాలో రైల్వే విభాగానికి వచ్చినట్టు వినికిడి. ఈ అధికారులు తనను ఎలాంటి హింసించారో కాదంబరి ఫిర్యాదులో పేర్కొంది. తనకు కొంతమంది పేర్లు మాత్రమే తెలుసునని, మిగిలిన వారిని చూస్తే గుర్తుపడతానని వాంగ్మూలం ఇచ్చినట్టు సమాచారం. కాదంబరి ఇచ్చిన ఫిర్యాదులో పేర్లు లేవని కొంతమంది సంబరపడుతున్నారు. ఐడెంటిఫికేషన్ పెరడ్ నిర్వహిస్తే ఆ ముఖాలకు ఉన్న ముసుగు తొలగిపోతుందని భావిస్తున్నారు. ఇప్పటికే కుక్కల విద్యాసాగర్‌పై కేసు నమోదు చేసినందున తర్వాత ఎఫ్ఐఆర్‌లో ఎవరి పేర్లు చేరతాయోనన్న ఆందోళన హద్దులు దాటిన ఖాకీల్లో కనిపిస్తోంది. కాదంబరి జెత్వాని ఇచ్చిన వాంగ్మూలను బేరీజు వేసుకుని మిగిలిన వారిపై చర్యలు తీసుకోవడం ఖాయమన్న వాదన ఆమె తరఫున న్యాయవాదులు చెబుతున్నారు. ఈ ముంబై నటి కేసు వ్యవహారం రోజురోజుకు తీవ్రరూపం దాల్చడంతో ఆమె అరెస్టుతో ప్రమేయం ఉన్న పోలీసులు ఇప్పుడు కొత్త ప్రవచనాలు చెబుతున్నట్టు సమాచారం. కాదంబరిని కస్టడీలోకి తీసుకున్న తర్వాత ఆమెకు అన్ని రకాల సహాయ సహకారాలు తామే అందించామని ప్రచారం చేసుకుంటున్నారు. ఇలా చేసుకోవడం ద్వారా అధికారులు తీసుకునే చర్యల నుంచి తప్పించుకోవచ్చన్న యోచనలో ఉన్నారు. నాడు తనను, కుటుంబాన్ని చిత్రహింసలు చేసిన ప్రతి ఒక్కరి పైనా చర్యలు తీసుకోవాల్సిందేనని కాదంబరి డిమాండ్ చేస్తోంది.

ఒక్కొక్కరికిపై వేటు

కాదంబరిపై కేసు నమోదు చేయడం, ఆమెను అరెస్టు చేయడంలో ఒక అదనపు ఎస్పీ, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఒక ఎస్ఐ కీలకంగా వ్యవహరించినట్టు ఆమె ఆరోపించింది. వారిలో ఒక ఇన్‌స్పెక్టర్, ఎస్ఐ పేరును ఫిర్యాదులో పేర్కొంది. ఈ అదనపు ఎస్పీ ఇపుడు గుంటూరు జిల్లాలో పనిచేస్తున్నారు. ఇన్‌స్పెక్టర్లలో ఒకరు విజయవాడలో ఉండగా, మరొకరు ఏలూరు రేంజ్‌లో ఉన్నారు. ఎస్ఐ మాత్రం కృష్ణా జిల్లాలో రైల్వే విభాగంలో పనిచేస్తున్నారు. కాదంబరి నుంచి వాంగ్మూలం ద్వారా తీసుకున్న వివరాలను విచారణాధికారి స్రవంతిరాయ్ పోలీసు కమిషనర్ రాజశేఖరబాబుకు అందజేశారు. ఆ నివేదికను ఆయన డీజీపీకి పంపారు. కాదంబరితోపాటు ఆమె తండ్రి నరేంద్ర కుమార్ జెత్వాని, తల్లి ఆశా జెత్వాని వాంగ్మూలం ఇచ్చారు. ఈ నివేదికను పరిశీలించిన ఉన్నతాధికారులు ఒక్కొక్కరిపై క్రమంగా వేటు వేయడం మొదలు పెట్టారు.


చింతలపాడులో పనికిరాకుండా పోయిన పత్తి

విలపించేను!

వరదల విధ్వంసానికి కోల్పోయిన పంటలను చూసి రైతన్నల విలవిల

- బిడ్డలా పెంచుకున్న పంటలన్నీ వరదపాలు
- తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో వరదలోనే వరి
- పత్తి, మిర్చి, కూరగాయలు, పండ్లతోటలకు పెను నష్టం
- కొద్దోగొప్పో మిగిలిన పంటలకు వైరస్ తెగుళ్లు
- కోతకు గురైన పొలాల్లో పైకి తేలిన రాళ్లు..
- చెరువులకు గండ్లుపడి వేల ఎకరాలు నీటమునక

'ఆంధ్రజ్యోతి' పొలంబాటలో రైతులు కన్నీరుమున్నీరు

ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా 200 కిలోమీటర్లు బృందం పర్యటన

సాయం కోసం ప్రభుత్వాన్ని వేడుకుంటున్న కర్షక జనం

ఏ చేను చూసినా ఏమున్నది గర్వకారణం.. సమస్తం సర్వనాశనం అన్నట్టుంది ఎన్టీఆర్ జిల్లాలో వానలు, వరదలతో దెబ్బతిన్న పంట పొలాల పరిస్థితి. బిడ్డలా పెంచుకున్న పంట కళ్లముందే నీటిపాలవడంతో తట్టుకోలేక రైతన్నలు విలవిల్లాడిపోతున్నారు. జరిగిన నష్టాన్ని తలుచుకుని కుమిలిపోతున్నారు. ఎలా కోలుకోవాలో తెలీక తల్లడిల్లిపోతున్నారు. వరద తగ్గాక నామరూపాల్లేకుండా పోయిన పొలంవైపు చూసి కన్నీటిపర్యంతమవుతున్నారు. వరి, పత్తి, మిర్చితోపాటు కూరగాయలు, పూలు, పండ్ల తోటలూ పూర్తిగా ధ్వంసమై బురద కయ్యలుగా మారాయి. ఎక్కడైనా కొద్దోగొప్పో పంట మిగిలినా రోజుల తరబడి నీటిలో ఉండడం వల్ల ఆకులు కుళ్లిపోయాయి. తేమ వల్ల వైరస్ తెగుళ్లు సోకాయి. కళ్లముందు ఉన్నట్టే కనిపిస్తున్నా ఆ పంటలు కూడా చేతికి రాని దుస్థితి నెలకొంది. పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌లు, మోటార్లు వరదకు తుడిచిపెట్టుకు పోయాయి. కొన్ని పొలాలు ఇసుక మేటలు వేశాయి. గట్లు తెగి భారీ గండ్లు పడిన చేలు ఎంత మేరకు దెబ్బతిన్నాయో ఎలా సరి చేసుకోవాలో తెలియక రైతులు తలలు పట్టుకుంటున్నారు. కనీవినీ ఎరుగని ఈ విపత్తు నుంచి తాము కోలుకోవాలంటే ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలని వేడుకుంటున్నారు. వరదల వల్ల దెబ్బతిన్న మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లోని 9 మండలాల్లో సుమారు 200 కిలోమీటర్లు ఆంధ్రజ్యోతి బృందం ఆదివారం తిరిగి పొలాల్లో పర్యటించి రైతుల బాధలను తెలుసుకుంది.

- కథనాలు 6లో

అయినోళ్లకే ఓడీలు

వైసీపీ హయాంలో రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో అయిన వాళ్లకు అడ్డగోలుగా ప్రయోజనాలు కల్పించేశారు. ఆర్టీసీలో అమలులో లేనటువంటి అవుట్ ఆఫ్ డిజిగ్నేషన్ డ్యూటీ (ఓడీ) విధానాన్ని అక్రమ పద్ధతిలో తీసుకువచ్చి పెద్దఎత్తున వైసీపీ మద్దతుదారులకు ప్రయోజనం కల్పించారు. ఎలాంటి అనుమతి లేకుండా కొన్నేళ్లుగా ఎన్టీఆర్ జిల్లాలో అక్రమంగా భారీ సంఖ్యలో ఉద్యోగులు ఓడీలు చేస్తున్నారు. తోటి ఉద్యోగుల నుంచి ఫిర్యాదులు రావటంతో ఎన్టీఆర్ జిల్లా ఆర్టీసీ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. జిల్లాలోనే 113 మంది ఉద్యోగులు అక్రమంగా ఓడీలు చేస్తున్నట్టు వెలుగు చూసింది. దీంతో ఎన్టీఆర్ జిల్లా ఆర్టీసీ ఆర్ఎం ఎంవై దానం తక్షణం అక్రమంగా ఓడీలు చేస్తున్న వారికి సోమవారం నుంచి సాధారణ డ్యూటీలు వేయాలని ఆదేశించారు. కృష్ణా జిల్లాలో కూడా దాదాపు వంద మందికిపైగా ఇదే పద్ధతిలో అక్రమంగా ఓడీలు చేస్తున్నారని తెలుస్తోంది.



వైసీపీ హయాంలో ఆర్టీసీలో అడ్డగోలు వ్యవహారాలు

- ఎన్టీఆర్ జిల్లాలో కాంపిటెంట్ అథారిటీ శాంక్షన్ లేకుండా భారీ సంఖ్యలో అక్రమంగా ఓడీలు
- అలా చేస్తున్న వారిపై ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఫిర్యాదులతో విచారణ
- మొత్తం 113 మంది ఉద్యోగులు అక్రమంగా ఓడీ ప్రయోజనాలు పొందుతున్నారని గుర్తించిన ఆర్టీసీ
- తక్షణం వారిని సాధారణ డ్యూటీలకు మాత్రమే పంపాలని ఉన్నతాధికారి ఆదేశాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ఆర్టీసీలో విపరీత పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఆర్టీసీని జేబు సంస్థగా వైసీపీ పెద్దలు మార్చివేశారు. వైసీపీ పెద్దల ఆదేశాలతో నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి మరీ అయినవాళ్లకు అగ్ర తాంబూలం కల్పించారు. ఎన్టీఆర్ జిల్లాలో ఆటోనగర్ బస్ డిపోకు సంబంధించి నలుగురు, గవర్నర్ పేట - 1 డిపోలో 25 మంది, గవర్నర్‌పేట - 2 డిపో పరిధిలో 19 మంది, ఇబ్రహీంపట్నం డిపో పరిధిలో నలుగురు, తిరువూరు డిపో పరిధిలో ఆరుగురు, విద్యాధరపురం బస్ డిపో పరిధిలో 20, విజయవాడ డిపో పరిధిలో ఏడుగురు చొప్పున 113 మంది ఉద్యోగులు అక్రమంగా ఓడీలు చేస్తున్నారు. ఇలా అక్రమంగా ఓడీ చేస్తున్న వారిలో మొత్తం 30 మంది డ్రైవర్లు ఉండగా.. 83 మంది కండక్టర్లు ఉన్నారు. వీరంతా తమ సాధారణ విధులకు భిన్నమైన డ్యూటీలు చేస్తున్నారు. వీరి ఓడీలు చూస్తే సుఖవంతమైన కార్గో ఆఫీసులు, సీఎం వెహికల్ యూనిట్, హెడ్డాఫీసు, పీఎఫ్ ట్రస్టు, ఆర్టీసీ హౌస్‌లు, ఆర్టీసీ పరిరక్షణ, సిటీ బస్ టెర్మినల్, చీఫ్ మేనేజర్ మార్కెటింగ్, విజయవాడ మెడికల్ వార్డ్, లాజిస్టిక్స్, స్టోర్ సూపర్‌వైజర్, సిస్టమ్ సూపర్ వైజర్, క్యాష్ సెక్షన్, పీఎన్‌బీఎస్ కంట్రోలింగ్, స్క్వాడ్ జీప్, బస్‌పాస్ కౌంటర్లు, పీఎన్‌బీఎస్ కార్గో వంటి చోట్ల కదుపులో చల్లకదలకుండా ఉండే ఉద్యోగాలు చేస్తున్నారు. వాస్తవానికి ఓడీ కల్పించాలంటే.. కాంపిటెంట్ అథారిటీ అనుమతి ఉండాలి. అత్యవసర పరిస్థితుల్లో ఉద్యోగాలు చేసే వారికి ఈ ఓడీ సదుపాయాన్ని కల్పించటంలో తప్పు లేదు. మెడికల్ అన్‌ఫిట్ అయిన డ్రైవర్లు, కండక్టర్లు తిరిగి తమ సాధారణ విధులు నిర్వహించలేరు. తీవ్ర అనారోగ్యం పాలైనవారు, హృద్రోగులు, క్యాన్సర్ పేషంట్లు వంటివారు తమ సాధారణ డ్యూటీలు చేయటంలో ఎంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇలాంటి బాధితులు పెద్ద సంఖ్యలో ఆర్టీసీలో ఉన్నారు. తమ పరిస్థితిని చూసి మానవత్వంతో ఓడీలు కల్పించాల్సిందిగా చేసిన విజ్ఞప్తులను ఆర్టీసీ డిపో మేనేజర్లు ఖాతరు చేయలేదు. కానీ అవయవాలన్నీ బాగున్నవారికి, ఎలాంటి అనారోగ్య సమస్యలు లేనివారికి మాత్రం ఓడీలు కల్పించటం గమనార్హం. ఆయా డిపోలలో డిపో మేనేజర్లకు తాబేదార్లుగా వ్యవహరించే వారికి, వైసీపీ వీర విధేయులకు మాత్రం అడ్డగోలుగా ఓడీలు కల్పించేశారు. ఇలా ఐదేళ్లుగా నిర్విఘ్నంగా ఓడీలు అనుభవిస్తున్నారు.

వందలాది మందికి ఓడీ ప్రయోజనాలు

ఎన్టీఆర్ రీజియన్ పరిధిలో రికార్డు స్థాయిలో 113 మంది ఉద్యోగులు అక్రమంగా ఓడీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఆర్టీసీ విజయవాడ జోన్ పరిధిలోని మిగిలిన రీజియన్లలో కూడా వందల సంఖ్యలో అక్రమంగా ఓడీలు నిర్వహిస్తున్నారని తెలుస్తోంది. ఎన్టీఆర్ జిల్లా తరహాలో జోన్ పరిధిలోని మిగిలిన రీజియన్లలో కూడా విచారణకు ఆదేశిస్తే భారీ సంఖ్యలో అక్రమంగా ఓడీలు నిర్వహిస్తున్న వారి జాబితాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

సెక్రటేరియట్‌లోని రవాణా శాఖకు మహిళా ఉద్యోగులు

వైసీపీ అధికారంలో ఉండగా.. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేశారన్న సాకుతో నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది మహిళలను సెక్రటేరియట్‌లోని రవాణా శాఖకు బదలాయించారు. ఆర్టీసీ ఉద్యోగులను ఇతర డిపార్ట్‌మెంట్లలోకి పంపించాలంటే కచ్చితంగా సీనియారిటీని ప్రాతిపదికగా తీసుకోవాలి. సీనియారిటీని పక్కన పెట్టి కొందరు మహిళా ఉద్యోగులను రవాణా శాఖకు పంపించారు. ఈ వ్యవహారంలో అప్పటి ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి హస్తం కూడా ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఇలాంటి వ్యవహారాలపై తక్షణం ప్రస్తుత ప్రభుత్వం విచారణకు ఆదేశించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు దుర్మరణం

బైక్‌పై వెళ్తుండగా లారీ ఢీకొనడంతో దుర్ఘటన

6లో

వరద మిగిల్చిన వ్యథ

ఎన్టీఆర్ జిల్లాలో 200 కిలోమీటర్ల మేర ఆంధ్రజ్యోతి పొలంబాట

వరదముంపునకు గురైన పంటను కాపాడుకోలేక నాడు నిస్సహాయంగా నిలిచిన అన్నదాత బురదలో కుళ్లిపోతున్న మొక్కలు చూస్తూ నేడు కుమిలిపోతున్నాడు. భారీవర్షాలతో పొంగిన మునేరు, కృష్ణా నదులు శాంతించినా విధ్వంసానికి గురైన పంటలు చూస్తూ రైతులకు మనఃశ్శాంతి కరువైంది. వరద ఉధృతికి కొన్ని గ్రామాల్లో పంటలు కొట్టుకుపోయిగా, మరికొన్ని చోట్ల అధిక తేమతో నేడు నిలువునా ఎండిపోతున్నాయి. ఎన్టీఆర్ జిల్లాల్లో పంట నష్టపోయిన గ్రామాల్లో ఆంధ్రజ్యోతి బృందం శనివారం పర్యటించి వారి సాధకబాధకాలను తెలుసుకుంది.



ఇసుక మేటల్లో పంట పొలాలు



అన్నవరం- రెడ్డినాయక్ తండా గ్రామాల మధ్య కొట్టుకుపోయిన రోడ్డు



గంపలగూడెంలో నీటమునిగిన వరిపైరు

జి.కొండూరు / రెడ్డిగూడెం / మైలవరం / ఇబ్రహీంపట్నం / గొల్లపూడి / మైలవరం రూరల్ / తిరువూరు / ఎ.కొండూరు / గంపలగూడెం /విస్సన్నపేట: వరదలతో దెబ్బతిన్న పంట పొలాలను ఆంధ్రజ్యోతి టీమ్ శనివారం క్షేత్రస్థాయి పర్యటన చేసింది. మైలవరం, తిరువూరు నియోజకవర్గంలోని 9 మండలాల్లో సుమారు 200 కిలోమీటర్ల మేర పొలాల్లో పర్యటించి రైతుల బాధలను తెలుసుకున్నారు. ఏ రైతును కదిలించినా కన్నీటి కథలే. చరిత్రలో ఎన్నడూ లేనంత వర్షం, 25 నుంచి 30 సెంటీమీటర్ల వర్షంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. ముఖ్యంగా మైలవరం నియోజవర్గంలోని ఐదు మండలాలను బుడమేరు, పులివాగు, కోతులవాగుతో పాటు మరికొన్ని వాగులు ముంచేశాయి. ఇబ్రహీంట్నం మండలంలోని ఏటి పట్టు గ్రామాల రైతుల్ని కృష్ణానదికి వచ్చిన వరదలు కోలుకోలేని దెబ్బతిశాయి. బుడమేరు పరివాహక ప్రాంతాలు జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల్లోని ఈలప్రోలు, గుంటుపల్లి గ్రామాల్లోని వరి ఇప్పటికీ నీటిలోనే నానిపోయి కుళ్లిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, షాబాద, గొల్లపూడి, రాయనపాడు, పైడూరుపాడు గ్రామాల్లో వరిపంటలు పూర్తిగా నాశనమై రైతులు కోలుకోలేని దెబ్బతిన్నారు. మైలవరం మండలం చంద్రాలలోని చెరువుకు గండిపడి చంద్రాల, గణపవరం గ్రామాల పరిధిలోని వేల ఎకరాల్లో వరిపంట నీట మునిగింది. పొందుగల ఎర్రచెరువు కింద వరద ఇంకా ప్రవహిస్తుండటంతో వరిపంటలు ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. రెడ్డిగూడెం మండలంలో కొత్త నాగులూరు, పాత నాగులూరు గ్రామాల్లో 4 చెరువులకు గండ్లు పడటంతో 50 ఎకరాల్లో వరి పంట పాడైంది. ఓబులాపురంలో నాగసానిపాటి చెరువు వాగ వరద వారం పాటు ఉంటడంతో వరి చేలు పాడయ్యాయి. పొలాల గట్ల మధ్యలోని వందల కొద్దీ ఆయిలింజన్లు పాడయ్యాయి. ఒక్కో ఇంజన్ మరమ్మతుకు రూ.2వేల వరకు ఖర్చవుతుందని అన్నదాతలు వాపోతున్నారు. తిరువూరు నియోజకవర్గంలో కొన్ని మండలాల్లో వరి పాక్షికంగా, మెట్టపంటలు భారీగానే దెబ్బతిన్నాయి, తిరువూరు, ఎ.కొండూరు, విస్సన్నపేట, గంపలగూడెం మండలాల్లో వగులు, చెరువుల ఆయకట్టులో సాగుభూములు నేటికి నీటిలోనే మునిగిఉన్నాయి. తిరువూరు మండలం చిక్కుళ్లగూడెంలో పత్తిపైరు వరదలకు కొట్టుకుపోగా, పిటి.కొత్తూరులో సుమారు 200 ఎకరాల్లో పత్తి ఎర్రబడి ఎదుగుదల లేకుండా పోయింది. ఎ.కొండూరు మండలంలో సుమారు 120 ఎకరాల్లో సాగులో ఉన్న మినుము, పెసర వర్షాలకు మొలకలు రావడంతో పంటనష్టం తీవ్రంగా జరిగింది. గంపలగూడెం మండలంలో 60 శాతం వరి, 60 శాతం పత్తిపంటలకు నష్టం వాటిల్లింది. కనుమూరు, వినగడప, అనుముల్లంక, గ్రామాల్లో వాగువడ్డు పొలాల్లో ఇసుక, మట్టి మెటలు వేశాయి. వినగడప రాళ్లచెరువు, గంపలగూడెం నల్లచెరువు వాగుకు, ఊటుకూరు నల్లచెరువు, పెనుగోలను ఊరచెరువులకు గండ్లు పడి వరదనీరు ఆయకట్టు భూముల్ని ముంచేసింది. విస్సన్నపేట మండలంలో కలగర గాజులచెరువుకు గండి పడటంతో సమీపంలోని వరిపైరు నీటీ మునిగిఉంది.

నిస్సహాయతకు కుమిలిపోతున్నరైతు..

నందిగామ: భారీగా పెట్టుబడులు పెట్టి కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన పంటలు వారం రోజుల వ్యవధిలో తుడిచిపెట్టుకుపోయాయి. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు పెట్టుబడులకు డబ్బు లేక ఏమీ పాలుపోని దుస్థితికి చేరారు. ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. అరకొర సాయం కాకుండా కూటమి ప్రభుత్వం దన్నుగా నిలవాల్సిన సమయం ఇది అని అంటున్నారు. మునేటి వరదకు పలు గ్రామాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రధానంగా మునేటి ఆయకట్టులోని కంచల గ్రామ రైతులు సర్వం కోల్పోయారు. వరద బీభత్సంతో నేడు ఆ గ్రామం బీటిల్లి కనిపిస్తుంది. దశాబ్దాలుగా సుమారు 300 కుటుంబాలు ఆ గ్రామంలో కూరగాయలు, ఆకు కూరలు సాగు చేస్తూ జీవిస్తున్నారు. సుమారు 70ఎకరాల్లో కూరగాయలు, ఆకు కూరల తోటలు నామ రూపాలు లేకుండా పోయాయి. సుమారు 500 ఎకరాల్లో వరిపంట పూర్తిగా దెబ్బతినంది. తిరిగి నాట్లు వేసేందుకు నారు సిద్ధంగా లేకపోవడంతో రైతులు డీలా పడుతున్నారు. చెరకు, మొక్కజొన్న, పండ్ల తోటల్లో నీరు ఇంకా నిలబడే ఉండడం అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తుంది. గోళ్లమూడి, రాఘవాపురం, కొణతమాత్మకూరు గ్రామాల్లోనూ దాదాపుగా ఇదే పరిస్థితి.

గ్రామాలన్నీ కకావికలం

జగ్గయ్యపేట రూరల్: మండలంలో ని పాలేరు నదీ పరివాహక గ్రామాల్లో ఇటీవల కురిసిన తుపాన్, ఎగువ నుంచి వచ్చిన వరదతో ఆయా గ్రామాలు కకావికలమయ్యాయి. ప్రధానంగా వరి, పత్తి, మిర్చితో పాటు మామిడి తోటలు, ఉద్యాన పంటలు, కూరగాయలు, కోళ్ల ఫారా లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు వరదకు తుడిచిపెట్టుకుపోయా యి. సాగు భూములు కోతకు గురై రాళ్లు తేలాయి. తమ భూములు ఎంత మేరకు దెబ్బతిన్నాయో ఎలా సరి చేసుకోవాలో తెలియక రైతులు తలలు పట్టుకుంటున్నారు. ప్రధానంగా తక్కెళ్లపాడు, బలుసుపాడు, అన్నవరం, బూదవాడ, కె.అగ్రహారం రైతులను వరద ఉధృతి దెబ్బతీసింది. రహదారులు, వంతెనలు కొట్టుకుపోవటంతో రాకపోకలు పునరుద్ధరించలేదు. ప్రభుత్వం సహకారం అందించినా కోలుకునేందుకు కొన్నేళ్లు పడుతుందని రైతులు అంటున్నారు.

వత్సవాయి: మండలంలో 995 హెక్టార్లలో పంటలు నాశనమయ్యా యి. వరి 480 హెక్టార్లు, పత్తి 300 హెక్టార్లు, మొక్కజొన్న 10 హెక్టా ర్లు, పెసర 5 హెక్టార్లు, ఇసుక మేట ద్వారా 200 హెకార్ల పం ట పొలాలు దెబ్బతిన్నాయి. పోలంపల్లి, వేమవరం, లింగాల, పోచవరం, గంగవల్లి చిట్యాల, కన్నెవేడు గ్రామాల పరిధిలోని పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

మూడొంతుల గ్రామాలు అతలాకుతలం..

చందర్లపాడు: కృష్ణా, మునేటి నదులు ఉప్పొంగటంతో మండలంలోని పలు గ్రామాలలో పంటలు తుడిచిపెట్టుకుపోయాయి. దాదాపు మూడొంతుల గ్రామాలు ముంపునకు గురై అతలాకుతలమయ్యాయి. చింతలపాడు, కొడవటికల్లు రైతులకు అతి భారీ నష్టం జరిగింది. చింతలపాడు, తోటరావులపాడు, ఏటూరు గ్రామాల్లో మునేటి వరద వల్ల దాదాపు 1200 ఎకరాల మాగాణీ పంటల పూర్తిగా ధ్వంసమైంది. ఇసుక నేల కావడంతో కోతకు గురై వరి పంట ఆనవాళ్లు లేకుండా పోయింది. వందల ఎకరాల్లో చెరకు, మొక్కజొన్న పంటలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. పత్తి, మిర్చి వంటి వాణిజ్య పంటలు బురదకయ్యలుగా మారాయి. కొడవటికల్లు గ్రామం వాణిజ్య పంటలకు పెట్టింది పేరు. కృష్ణా నది వరదకు ఈ గ్రామంలో సుమారు 250 ఎకరాల్లో మిర్చి పంట పూర్తిగా కొట్టుకుపోయింది. గుడిమెట్ల వద్ద నుంచి ఏటూరు వరకూ ఉస్తేపల్లి, కాసరబాద, పొక్కునూరు, కొడవటికల్లు, పున్నవల్లి, పోపూరు, విభరింతలపాడు, రామచంద్రాపురం గ్రామాల్లో కృష్ణా వరద ప్రభావానికి గురి కాగా, ఏటూరు, చింతలపాడు, తోటరావులపాడు, తుర్లపాడు, కొత్త కంచల గ్రామాలు మునేటి వరదకు బలయ్యాయి. మిగిలిన నాలుగైదు గ్రామాల రైతులు భారీ వర్షాలకు బలయ్యారు. పంట నష్టం ఇప్పటికే 92 శాతం వరకూ అధికారులు నమోదు చేసినట్లు తెలిసింది

కంచికచర్ల మండలంలో..

వరదలు, భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. గనిఆత్కూరు, కొత్తపేట, చెవిటికల్లు గ్రామంలో పంటలకు భారీ నష్టం వాటిల్లింది. సన్న చిన్నకారు రైతులతో కూడిన ఈ గ్రామాలు వర్ష బీభత్సానికి తీవ్రంగా నష్టపోయింది.తో పాటు వాణిజ్య పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయి. కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. కొత్తపేట, గనిఆత్కూరు గ్రామాల్లో పంట పొలాలతో పాటు ఇళ్లలో నిల్వ ఉంచిన పంటలు కూడా నీటమునిగి దెబ్బతిన్నాయి.

వీరులపాడు మండలంలో..

మునేటి ఒడ్డున ఉన్న వీరులపాడు మండలంలోని పలు గ్రామాలను ఏనుగుగడ్డ వాగు ముంచింది. పెద్దాపురం, అల్లూరు, జుజ్జూరు, నరసింహారావుపాలెం, చెన్నారావుపాలెం, గొట్టుముక్కల తదితర గ్రామాల పంటలను ఈ వాగు కబళించింది. ఆయకట్టులోని పంటలను మూడు రోజుల పాటు పూర్తిగా ముంచింది. వరద ఉధృతికి పత్తి, మిర్చి పంటలు కొంత మేర కొట్టుకుపోగా, మరి కొంత పంట ఎండిపోతుంది. వరద తీసిన అనంతరం వేరు కుళ్లు తెగులు వచ్చి పత్తి, మిర్చి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొందరు రైతులు నిస్సహాయంగా పంటలు వదిలేయగా, మరి కొందరు బ్రతికించుకొనే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వ సాయం కోసం వేచి చూస్తున్నారు.

కోరినంత కాకపోయినా.. కోలుకొనేంతైనా..!



చందర్లపాడు: భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన రైతులు ప్రభు త్వ సాయం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. గతంలో వర్షాలు, వరద లు వచ్చినప్పుడు పంటలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అప్పట్లో ప్రభుత్వా లు అరకొర సాయం ఇస్తూ వచ్చాయి. ఈ దఫా వచ్చిన కష్టం వ్యవసాయ రంగ చరిత్రలో ఎన్నడూ రాలేదు. ప్రభుత్వం తన సాయాన్ని ఏ మేర ప్రకటిస్తుందోనన్న మీమాంసలో అన్నదాతలు కొట్టుమిట్టాడుతున్నారు. విజయ వాడ వరదల్లో ప్రజలకు సీఎం చంద్రబాబు చేసిన సేవ, ఇచ్చిన భరోసా, వరద తరువాత చేస్తున్న సాయం మొత్తాన్ని పరిశీలిస్తున్న అన్నదాతలు ఒకింత ధైర్యంగానే ఉన్నారు. తమను కూడా అదే తీరున ఆదుకోవాలని కోరుతున్నారు. మళ్లీ పంటలు వేయాలంటే ఎకరాకు రూ.15 నుంచి రూ.25వేల వరకూ ఖర్చవుతుంది. ఈ మొత్తం ఖర్చులను అంచనా వేసుకొని ప్రభుత్వం సాయం చేయాలని వేడుకుంటున్నారు. అంతా కాకపోయినా కోలుకొనే మేర సాయమందిస్తే చాలని కోరుతున్నారు.

వరద కష్టాలు.. రైతుల మాటల్లో..

తక్షణం గండ్లు పూడ్చాలి
బొర్రా హనుమంతరావు,రైతు, కవులూరు



చెరువులు, కాలువలకు పడిన గండ్లను తక్షణం పూడ్చకపోతే వరదలకు పోగా మిగిలిన పంటలకు సాగునీరుండదు. ఒక పక్క వరదలతో నష్టపోయాం. మరోపక్క సాగునీరు లేక నష్టపోతాం. ఉన్న పంటలైనా చేతికి రావాలంటే గండ్లు పూడ్చటం ఒక్కటే మార్గం.

పంట నష్టం ప్రకటించాలి
గాదె వెంకటరెడ్డి, రైతు, గణపవరం



రెండున్నర ఎకరాల్లో వరిపంట సాగుచేశా. వరద ధాటికి పంట మొత్తం కుళ్లిపోయింది. ఇప్పటికే పంట సాగుకోసం వేలాది రూపాయలు ఖర్చు చేశా. మళ్లీ పంట వేద్దామన్నా నారు దొరకని పరిస్థితి. ప్రభుత్వం పంట నష్టం ప్రకటించి ఆదుకోవాలి.

ప్రభుత్వం సాయం పెంచాలి.. రైతు, ఈలప్రోలు

ఇబ్రహీంపట్నం మండలంలో పంటలు అన్ని 15 రోజులుగా నీటి ముంపులో ఉన్నాయి. పంట కుళ్లిపోయింది. ఎకరానికి రూ.20 వేలు పెట్టుబడి పెట్టాం. ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేలు ఇస్తే ఎలా సరిపోతుంది. పరిహారం పెంచి ఆదుకోవాలి.

నష్టపరిహారం అందించాలి
బొంతు మాధవరావు, పత్తి రైతు చిట్యాల



ప్రస్తుతం తుఫాను ప్రభావంతో నష్టపోయిన పంటలకు నష్టపరిహారం అంచనలు వేస్తున్నట్లే పత్తిపంటలు పరిశీలించిన నష్ట పరిహారం అందించాలి, ఇప్పటికే పెట్టుబడుల రూపంలో వేలాధి రూపాలు ఖర్చుచేశాం,

చేతికొచ్చిన పంట సర్వనాశనమైంది
వడ్డే సాంబశివరావు, రైతు తూర్పు మాధవరం



ఆరుగాలం కష్టించి పండించిన పంట నీటిపాలైంది. ఎకరాకు రూ.20 వేరు ఖర్చయింది. కోతకు సిద్ధం చేస్తున్న తరుణంలో భారీ వర్షాలు, వరదలకు పైరు తడిసి మొలకలెత్తాయి. ప్రభుత్వం ఇబ్బందులు గుర్తించి ఆదుకోవాలి.

ప్రభుత్వం ఆదుకోవాలి
మల్లెంపల్లి సాంబశివరావు, రైతు, వీరరాఘవపురం



వరదలకు పొలం మొత్తం ముంపు బారిన పడింది. ఎకరానికి రూ.20 వేలు ఖర్చు అయ్యింది. తిండి గింజలు పోయాయి. చెరువు అలుగు నీరు చేలోనే ఉంటుంది.

నిలువునా ముంచింది: యానాల గోపీ, రైతు



పాలేటికి వచ్చిన వరద నిలువునా ముంచింది. కొన్ని వ్యవసాయ భూముల్లో ఈ ఏడాది పంట పాక్షికంగా దెబ్బతింది. వరద ఉధృతికి కోతకు గురైన పొలాలు సాగుకు అనుకూలగాఆ మారాలంటే ఏళ్లు పట్టేలా ఉంది.

వందేళ్లలో ఇలాంటి విపత్తు చూడలేదు
రమణయ్య, రైతు జగ్గయ్యపేట రూరల్



ఈ విపత్తు 100 ఏళ్లలో ఎప్పుడూ చూడలేదు. సాదారణంగా పంటలు మునిగినా వరదలతో పాటు ఒండ్రు మట్టితో తదుపరి ఏడాది పంటలు పండేవి. ఒండ్రు లేకపోగా సారవంతమైన మట్టి కొట్టుకుపోయింది. మట్టినెలా నింపాలో అర్థం కావటం లేదు.

రైతులకు కోలుకోలేని దెబ్బ
కస్తూర్తి శ్రీనివాసరావు, రైతు, పేట రూరల్



పాలేటికి వచ్చిన వరద రైతులకు కోలుకోలేని దెబ్బతీసింది. వ్యవసాయం కోసం ఏర్పాటు చేసుకున్న మోటార్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు వరద దాటికి కొట్టుకుపోయాయి. రైతులు శ్రమ ఈ ఏడాది వరద పాలైంది. రైతులు కొలుకోవటం కష్టంతో కూడుకున్న పని.

రూ. 50 నుంచి 70 వేలు ఖర్చైంది
వక్కంతుల నరసింహారావు, రైతు, పేట రూరల్



నారుమడుల నుంచి నాట్లు, ఎరువుల వరకు రూ. 50 నుంచి 70 వేలు ఖర్చు వచ్చింది. పంటలు పోయాయని బాధ పడాలో మేటలు తొలగించటం ఆలోచిస్తే భయం వేస్తుంది. రాయితీపై మేటలు తొలగించేందుకు వాహనాలను సరఫరా చేయటంతో పాటు వరద కోతకు గురైన పొలాలలో మేరువ తోలుకునేందుకు కూడా సారవంతమైన మట్టిని అందించాలి.

తమ్మినేని రమేష్, రైతు, పోలంపల్లి

వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టాం. వరదకు పంటలు కోల్పోయాం. ప్రభుత్వం ఆదుకోకకుంటే ఆత్మహత్యలే శరణ్యం.

వరద కష్టాలు.. రైతుల మాటల్లో..

ప్రత్యామ్నాయ పంటలే శరణ్యం
ములకలపల్లి కోటేశ్వరరావు, రైతు, కంచలపత్తి



వ్యవసాయం ప్రారంభించినప్పటి నుంచి ఇంతకష్టం ఎప్పుడూ చూడలేదు. పంటలన్నీ నీటిపాలయ్యాయి. మాగాణీ పూర్తిగా కొట్టుకుపోగా, వాణిజ్య పంటలు వేరుకుళ్ల తెగులతో నేడు దెబ్బతింటున్నాయి. ప్రభుత్వం సహకరిస్తే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని ఉంది.

పూర్తిగా దెబ్బతిన్న మిర్చిపంట
మన్నెం వేణుప్రసాద్, మిర్చి రైతు, చందర్లపాడు



వారంపాటు ఎడతెరిపి లేని భారీ వర్షాలతో మిర్చి పంట పూర్తిగా దెబ్బతింది. కొన్నిచోట్ల కృష్ణా వరదకు పూర్తిగా కొట్టుకుపోగా, మరికొన్నిచోట్ల అధిక తేమతో వేరు, ఆకు కుళ్లు తెగుళ్లు ఆశించి మొక్కలు ఎండిపోతున్నాయి. ప్రభుత్వం సాయం అందిస్తే తప్ప కొలుకొనే స్థితి లేదు.

పూర్తిగా ఎండిపోయిన మాగాణి
మేకపోతుల రాజేశ్వరరావు, చింతలపాడు



వారంపాటు పూర్తిగా నీటిలో ఉండడంతో పాటు వరద ఉధృతి అధికంగా ఉండడంతో మాగాణి పూర్తిగా ఎండిపోయింది. ఇప్పటికే రూ.20వేల వరకూ పెట్టుబడి పెట్టా. ప్రత్యామ్నాయ పంటలకు చేతిలో చిల్లిగవ్వ లేదు. ప్రభుత్వం సాయం అందించాలి.

సర్వం కోల్పోయా
మందా స్వామి, కొత్తపేట గ్రామం



14 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నా. మొక్కజొన్న, పత్తి, మినుము, పుల్లశనగ, పెరసర పంటలు సాగు చేస్తున్నా. వరద నీటిలో మునిగి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రభుత్వం పంటనష్టపరిహారం ఇవ్వాలి

ప్రభుత్వమే ఆదుకోవాలి
గంధం స్వామి, గనిఆత్కూరు గ్రామం



మూడెకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశా. వరదలకు పూర్తిగా దెబ్బతిన్నా. పొలం వెళితే మొక్కలు కుళ్లిపోయాయి. పంట తిప్పుకొనే పరిస్థితి లేదు. ప్రభుత్వం ఆదుకుంటే తప్ప కుటుంబం గడవడం కష్టమే.

కోలుకోలేని దెబ్బతిన్నాం
మేకపోతుల వెంకటదుర్గ, అల్లూరు గ్రామం



ఏనుగుగడ్డ వాగు ఆయకట్టులో రెండున్నర ఎకరాల భూమి ఉంది. పత్తి సాగు చేపట్టా. ఇప్పటికే రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టా. పంట పూర్తిగా దెబ్బతిన్నది. ప్రభుత్వమే ఆదుకోవాలి.



ఎమ్మెల్యే తాతయ్యతో మాట్లాడుతున్న జాడాన్, తదితరులు

ఆదుకోవాలని ప్రధానిని కోరుతాం

● తాతయ్యతో పంచాయతీ పరిషత్ ప్రతినిధుల భేటీ

జగ్గయ్యపేట, సెప్టెంబరు 15: ఎన్టీఆర్ జిల్లాలో వరద బాధిత ప్రాం తాల్లో పర్యటించిన అఖిల భారత పంచాయతీ పరిషత్ అధ్యక్షుడు అ శోక్ జాడాన్, రాష్ట్ర పంచాయతీ పరిషత్ అధ్యక్షుడు, జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముల్లంగి రామకృష్ణారెడ్డి, జాయింట్ సెక్రటరి గొల్ల మాల్యాద్రి నాయుడు ఆదివారం మధ్యా హ్నం ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యతో సమావేశమైయ్యారు. విజయవాడతో పాటు పేటలోని బూదవాడ, అన్నవరం, అగ్రహారాన్ని పరిశీలించారు. తాతయ్య మాట్లాడుతూ వరద ప్రభావంతో జిల్లాకు మునుపెన్నడూ లేని నష్టం జరిగిందని, కేంద్ర సహకరిస్తేనే కోలుకునే పరిస్థితి అన్నారు.

జగ్గయ్యపేట రూరల్: వర్షాలు, వరదల కారణంగా కృష్ణా, మున్నేరు, పాలేరు నదులు, వాగులు మునిగి పంట నష్టపోయిన పంట పొలాల్లోని ఇసుక మేట, పంటల సాగు, తాగునీటి వనరులు, బ్రి డ్జిలు, రహదారులు, స్థంభాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫారాలు, బోర్లు, పంపుసె ట్లు నష్టంతో పాటు కలిగిన అపార నష్టాన్ని కేంద్రం సానుకూలంగా ప రిశీలించి ఎన్ఆర్జీఎస్ ద్వారా ఆదుకునేలా కృషి చేస్తామని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు అశోకసింగ్ జోడాన్ హామీ ఇచ్చారు. ఆదివారం మండలంలోని బూదవాడ, రెడ్డినాయక్‌తండ, తక్కెళ్లపాడు గ్రామాల్లో టీడీపీ నేతలతో కలిసి పరిశీలించారు. ముల్లంగి రామకృష్ణారెడ్డి, కట్టా వెంకట నరసింహారావు, కస్తూర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన పూర్తిచేస్తాం: కలెక్టర్

మచిలీపట్నం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈనెలాఖరులోగా జిల్లాలోని ఫ్రీహోల్ట్ భూములకు పరిశీలన ప్రక్రియను పూర్తిచేస్తామని కలెక్టర్ బాలాజీ తెలిపారు. రాష్ట్ర రెవెన్యూ కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, సీసీఎల్‌ఏ ముఖ్యకార్యదర్శి జయలక్ష్మీ ఆదివారం జిల్లా కలెక్టర్లు, జేసీలతో ఫ్రీహోల్ట్ భూముల పరిశీలనపై వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ జిల్లాలో 682 ఎకరాలను ఫ్రీహోల్ట్ భూములుగా గుర్తించామన్నారు. ఇప్పటివరకు 11.9 ఎకరాలను రిజిస్ట్రేషన్‌చేశామని, 142 ఎకరాలకు రికార్డులను పరిశీలించామన్నారు. నెలాఖరులోపు ప్రక్రియను పూర్తిచేస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, కలెక్టరేట్ భూ విభాగం సూపరింటెండెంట్ నెల్సన్‌పాల్ పాల్గొన్నారు.

పారదర్శకంగా నష్టం వివరాల నమోదు

● మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ



వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి నారాయణ

విజయవాడ లీగల్, సెప్టెంబరు 15: వరద ముంపు ప్రభావం పడిన ప్రాంతంలో చివరి మైలు వరకు న్యాయం చేయాలనేదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి బాధితుడికీ అండగా నిలిచేందుకు చేస్తున్న కృషిలో భాగంగా అత్యంత పారదర్శకంగా నష్ట వివరాల నమోదుతో నివేదికలను రూపొందిస్తున్నట్టు మంత్రి పి.నారాయణ అన్నారు. వార్డు సచివాలయాల పరిధిలో డేటా క్రాస్ చెక్ ప్రక్రియపై మంత్రి నారాయణ అధ్యక్షతన ఆదివారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశాలు జరిగాయి. తొలుత ప్రత్యేక అధికారులతోనూ తర్వాత ఎన్యూమరేషన్ బృందాలతోనూ సమావేశం నిర్వహించారు. పురపాలక శాఖ డైరక్టర్ ఎం.హరినారాయణన్, విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జేసీ డాక్టర్ నిధి మీనా, వీఎంసీ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర పాల్గొన్నారు.

రీ వెరిఫికేషన్‌కూ ప్రాధాన్యం

ముంపు ప్రభావం పడిన ప్రతి ఇంటినీ సందర్శించి, నష్టం నమోదు చేశామని, అర్బన్ పరిధిలో 4,036 మంది ఎన్యూమరేటర్లతో దాదాపు 1,75,000 గృహాలకు సంబంధించి ఎన్యూమరేషన్ చేయడం జరిగిందని, అయితే ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ఏ ఒక్కరూ మిగిలిపోకుండా నివేదికలు రూపొందించాలనే ఉద్దేశంతో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో రీ వెరిఫికేషన్ ప్రక్రియకూ ప్రాధాన్యమిస్తున్నట్టు రీ వెరిఫికేషన్, సూపర్‌వైజరీ చెక్ ప్రక్రియలకు అధికారులు, సిబ్బంది సందేహాలను మంత్రి నారాయణతో ఉన్నతాధికారులు నివృత్తి చేశారు. ఆర్డీవో బీహెచ్.భవానీ శంకర్, వీఎంసీ అదనపు కమిషనర్ కే వీ సత్యవతి, వార్డు ప్రత్యేక అధికారులు, ఎన్యూమరేటర్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో మంత్రి పరిశీలన

వన్‌టౌన్: నిత్యం వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పొంగూరు నారాయణ పర్యటిస్తూ బాధితుల బాగోగులను తెలుసుకుంటూ వారిలో ధైర్యాన్ని, స్థైర్యాన్ని కల్పిస్తూ ప్రభుత్వం బాధితులకు అండగా ఉంటుందని భరోసా ఇస్తున్నారు. ఆదివారం కండ్రికలో జరుగుతున్న పారిశుధ్య పనులను స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ విజయవాడ పరిస్థితి మెరుగుపడిందన్నారు. మళ్లీ వరద వస్తుందంటూ ప్రజలను భయభ్రాంతులను చేయటం వెనుక వైసీపీ కుట్ర ఉందని భావిస్తున్నామన్నారు. డీజీపీకి ఫిర్యాదు చేశామన్నారు.

రేషన్ మాఫియా మధ్య వార్..!

● అడ్డుకోబోయిన కారును మరో కారుతో ఢీకొట్టిన డాన్ అనుచరులు

ఎ.కొండూరు, సెప్టెంబరు 15: ప్రభుత్వం మారినా రేషన్ మాఫియా అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుంది. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఒక వ్యక్తి ఐదేళ్ల నుంచి ఎన్టీఆర్ జిల్లా నందిగామ, జగ్గయ్యపేట, వీరులపాడు గంపలగూడె, తిరువూరు, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలాల కేంద్రంగా రేషన్ డాన్ తమ ఏజెంట్ల ద్వారా గ్రామాల్లో ఎండీయూ వాహనాల్లో దగ్గర నుంచి బియ్యం సేకరించారు. తిరువూరులో ఉన్న మరో మాఫియా నకిలీ వాట్సప్ విలేఖర్లకు సమాచారం అందజేశాడు. వీరు కారులో ఎ.కొండూరు మండలంలోని జీళ్లకుంట స్టేజీ వద్ద బియ్యం లారీని అడ్డుకున్నారు. రేషన్ డాన్ అనుచరులు బొలేరో కారుతో లారీకి అడ్డుకొన్న కారు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కొందరికి స్వల్పగాయాలైయ్యాయి. సమాచారం అందుకొన్న పీడీఎస్ డీటీ శ్వేత, పోలీసుల సహకారంతో బియ్యం లారీని కంచికచర్ల వద్ద పట్టుకున్నారు. మరో లారీని పోలిశెట్టిపాడు పెట్రోల్ బంక్ వద్ద పట్టుకొన్నరు.

సివిల్ సప్లయి డీటీ వివరణ

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై సమాచారం మేరకు రెండు లారీలు, 34 టన్నుల బియ్యం స్వాధీనం చేసుకొనని కేసు నమోదు చేసినట్టు తిరువూరు సివిల్‌సప్లల్ డీటీ శ్వేత తెలిపారు. రేషన్ అక్రమ మార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు.

రోడ్డుప్రమాదంలో తల్లీకొడుకు దుర్మరణం

విజయవాడ: రామవరప్పాడు రింగ్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో తల్లీకుమారుడు దుర్మరణం చెందారు. కండ్రికలోని పాత రాజీవ్‌నగర్ చెందిన లింగమనేని కృష్ణకుమారి (63), ప్రభుకుమార్ (42) తల్లీకొడుకు. ఇద్దరూ కలిసి బైక్‌పై గుణదలలో ఉంటున్న బంధువుల ఇంటికి బయలుదేరారు. రామవరప్పాడు రింగ్ వద్ద గుణదల వైపునకు తిరుగుతుండగా ఏలూరు నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో తల్లీకొడుకు లారీ చక్రాల కింద పడి ప్రాణాలు కోల్పోయారు. కేసును పటమట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కూటమితోనే కాంట్రాక్టర్ల జీవితాల్లో వెలుగులు

పటమట: ఐదేళ్లుగా ప్రభుత్వం చొరవ తీసుకుని కాంట్రాక్టర్ల సమస్యలపై మాట్లాడిందీ, చర్చిందీ లేదని, ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చొరవ తీసుకుని తమతో చర్చించి, పెండింగ్ బిల్లులు తెలుసుకుంటున్నారని కాంట్రాక్టర్లకు చీకటి రోజులు పోయాయని స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్సు అసోసియేషన్(సబ్కా) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం సబ్కా కృష్ణా జిల్లా నూతన కార్యాలయ ప్రారంభోత్సవం ఆత్మీయ సమావేశం గురునానక్ కాలనీ సమీపంలోని డైరీ కాలనీలో నిర్వహించారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మాజీ ఉపాధ్యక్షులు వల్లభనేని వెంకటేశ్వరరావు, ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ స్మాల్ అండ్ మీడియం ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షులు మురళీకృష్ణ పాల్గొన్నారు.

18న స్కూల్ గేమ్స్ అండర్-19 జట్ల ఎంపిక

విజయవాడ స్పోర్ట్సు: స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఉత్వర్వులు ప్రకారం ఉమ్మడి కృష్ణా జిల్లా క్రీడాజట్ల పోటీలను ప్రారంభిస్తున్నట్టు ఉమ్మడికృష్ణా జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-19 సెక్రటరీ వేమూరి రవికాంత ఒక ప్రకటనలో తెలిపారు. 18న కృష్ణలంక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 9గంటలకు టేబుల్ టెన్నిస్ బాలబాలికలకు, మధ్యాహ్నం 3 గంటలకు స్టేడియంలో ఫుట్‌బాల్ జిల్లా జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నామన్నారు. వివరాలకు 944011245లో సంప్రదించాలన్నారు.

18న ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

వన్‌టౌన్: బాధ్రపద శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 18న బుధవారం ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్టు దుర్గగుడి ఈవో రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 5.55 గంటలకు ఘాట్ రోడ్డులోని టోల్‌గేట్ వద్ద నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుంది. కుమ్మరిపాలెం సెంటర్, 4 స్తంబాల సెంటర్, సితార, కబేలా రోడ్డు, పాల ఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, నెహ్రూబొమ్మ సెంటర్, బ్రాహ్మణవీధి, రథం సెంటర్ మీదుగా తిరిగి ఉదయం 9 గంటలకు మహామండపం వద్ద ప్రదక్షిణ ముగుస్తుంది. భక్తులు విరిగిగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ప్రతి నెల పౌర్ణమి రోజు గిరి ప్రదక్షిణ దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	129, 138, 149
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.35

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 15 : వాతావరణ మార్పులతో అత్యధిక వర్షపాతం వల్ల వరదలు రావడానికి పర్యావరణ విఘాతమే కారణమని అందుకే పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా సహకరించాలని రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుంకర సాంబశివ రాయల్ తెలిపారు. పెరికీడులోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం మామిడి మొక్కను మాజీ ఎంపీటీసీ బేతాళ ప్రమీలారాణితో కలిసి నాటారు. గ్రామస్థులకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు గొట్టాపు ప్రవీణ్, కొత్తూరు రేఖ, సింగవరపు ప్రసాద్, రజిని, తదితరులు పాల్గొన్నారు.

బుడమేరు కాజ్‌వేలపై రాకపోకలు పునరుద్ధరణ

ఉంగుటూరు, సెప్టెంబరు 15 : మండలంలో ప్రధాన రోడ్డు మార్గాల్లో వున్న బుడమేరు కాజ్‌వేలపై వరద ప్రవాహం తగ్గటంతో అధికారులు ఆయా మార్గాల్లో రాకపోకలు ఆదివారం పునరుద్ధరించారు. భారీ వర్షాలు, వరదల కారణంగా బుడమేరు ఉగ్రరూపానికి మండలపరిధిలోని తరిగొప్పల, ఉంగుటూరు, కొయ్యగూరపాడు బుడమేరు కాజ్‌వేలపై మూడు నుంచి నాలుగు అడుగుల మేర వరదనీటి ప్రవాహం కొనసాగింది. దీంతో రెవెన్యూ, పోలీస్ అధికారుల నిరంతర పర్యవేక్షణలో సిబ్బంది సుమారు 15రోజులపాటు రేయింబవళ్లు పహారాకాస్తూ వాహనాల రాకపోకలు నిలిపివేశారు. ప్రస్తుతం ప్రవాహ ఉధృతి తగ్గటంతో తేలప్రోలు-ఉయ్యూరు, గన్నవరం-మానికొండ, గన్నవరం-పుట్టగుంట ప్రధాన రహదారుల్లో రాకపోకలు పునరుద్ధరించారు.

స్టీలు సామగ్రి పంపిణీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 15 : బుడమేరు వరదలకు ఇళ్లలోకి నీరు చేరడంతో సర్వం కోల్పోయిన బాధితులకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సూచనతో కమ్మవారి ఐక్య సేవాసమితి అండగా నిలబడింది. రంగయ్యప్పారావుపేట పునరావాస కేంద్రంలోని 200మంది వరద బాధిత కుటుంబాలకు అవసరమైన స్టీలు సామగ్రిని ఆదివారం అందజేశారు. అట్లూరి రాజశేఖర్, పొట్లూరి సత్యఫణీంద్ర కుమార్, లింగం శ్రీధర్, కొల్లిపర్ల శ్రీనివాస్, కొమ్మినేని శివ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందజేస్తున్న రాజశేఖర్ కుటుంబ సభ్యులు

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 15 : స్థానిక బాపులపాడు ధర్మకోనేరు చెరువు గట్టు మీద గ్రామస్థులు చేపట్టిన శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణానికి స్థానిక లారీ ట్రాన్స్‌పోర్టర్ అవిర్నేని రాజశేఖర్ రూ1,01,116 లక్షలు విరాళం అందించారు. ఆదివారం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు గూడవల్లి చిన్న, వీరమాచనేని నాగయ్యలకు విరాళాన్ని అంజేశారు. దాతను ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు అభినందించారు.

పాడిరైతుల శ్రేయస్సే విజయ డెయిరీ లక్ష్యం



దూడను పరిశీలిస్తున్న డాక్టర్ గంగాభవాని

గన్నవరం, సెప్టెంబరు 15 : పాడిరైతుల సంక్షేమమే విజయ డెయిరీ లక్ష్యమని పాలకేంద్రం అధ్యక్షురాలు కొమ్మినేని విజయలక్ష్మి అన్నారు. పురుషోత్తపట్నం మహిళా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం సభ్యురాలు అన్నే మౌనికకు చెందిన పశువు ఈత సమయంలో దూడ అడ్డం తిరిగింది. దీంతో విజయలక్ష్మికి సమాచారం ఇచ్చారు. వెంటనే విజయడెయిరీ సంచార పశువైద్య వాహనం డాక్టర్ ఇందేల గంగాభవానికి ఫోన్‌చేసి చెప్పగా వెంటనే వచ్చారు. దూడ అడ్డం తిరగడాన్ని గుర్తించి డాక్టర్ గంగాభవాని వైద్యం సేవలు అందించి నార్మల్‌గా దూడ వచ్చే విధంగా చేశారు. గేదె, దూడ రెండు ఆరోగ్యంగా ఉండటంతో మౌనిక కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులుకు, వెంటనే స్పందించిన విజయలక్ష్మి, గంగాభవానీలకు మౌనిక కృతజ్ఞతలు తెలిపారు. సూపర్‌వైజర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.





గన్నవరంలో నిమజ్జనానికి తరలిన వినాయకుడు, జంక్షన్ ఇందిరా నగర్‌లో.. వీరవల్లిలో..

వైభవంగా గణపతి నిమజ్జనాలు

నవరాత్రి పందిళ్లలో కొలువైన గణనాథులను ఆదివారం భక్తుల కోలాహలం నడుమ నిమజ్జనం చేశారు.

గన్నవరం, సెప్టెంబరు 15 : మండలం లోని దావాజీగూడెంలోని శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరుగుతున్న గణపతి నవరాత్రులు ఆదివారం ఘనంగా ముగిశాయి. తొలుత ఆలయ అర్చకులు ఎన్. రామాచార్యులు నేతృత్వంలో స్వామి వారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి సన్నిధిలోని పూర్ణం ప్రసాదానికి నిర్వహించిన వేలం పాటలో గ్రామానికి చెందిన చిగులూరి శ్రీనివాసరావు రూ.1,00,116లకు దక్కించు కున్నారు. లడ్డూ ప్రసాదాన్ని గొంది శివరామకృష్ణ రూ.1,05,116లకు పాడుకున్నారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ఏలూరు కాలువలో స్వామివారిని నిమజ్జనం చేశారు. స్థానిక రాయనగర్‌లోని సీవీఎల్ రాయుడు వాటర్ ట్యాంక్ వద్ద జరుగుతున్న గణపతి మహోత్సవాలు ముగిసాయి. స్వామివారిని ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు.

హనుమాన్‌జంక్షన్ : గణపతి నవరాత్రులు ముగింపు సందర్భంగా ఆదివారం జంక్షన్‌లో వాడవాడలా వినాయక నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఇందిరానగర్ విఘ్నేశ్వరాలయం, ఇందిరానగర్ గట్టుమీద, తారకరామానగర్, బాపులపాడు గ్రామాల్లో నిమజ్జనోత్సవ ర్యాలీలు జరిపారు. ర్యాలీలు జంక్షన్ సెంటర్ మీదుగా సాగి డప్పు, తీన్‌మార్ వాయిద్యాల నడుమ పెరికీడు వద్ద ఏలూరు కాలువలో విగ్రహాలకు నిమజ్జనం చేశారు. ర్యాలీ సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఎస్సై జనార్దన్ తన పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



వీరమ్మ మెట్టినింటి వద్ద వేలంపాటలో రూ. 41వేలకు లడ్డూ దక్కించుకున్న భార్గవ్

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : గణపతి మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం నిమజ్జనోత్సవాలను వైభవంగా నిర్వహించారు. వీరవల్లి గ్రామ యువత ఆధ్వర్యంలో హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన గణపతికి విగ్రహ దాతలు శ్రీమన్నారాయణ, భారతి దంపతులు, లంక కిషోర్, శ్రీలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిమజ్జనోత్సవ సందర్భంగా టీడీపీ అధ్యక్షుడు లంక సురేంద్ర మోహన బెనర్జీ, గుండపనేని ఉమావరప్రసాద్, నందమూరి కృష్ణ ప్రసాద్, పిల్లా రామారావు, లింగంనేని శ్రీనివాసరావులు గణపతికి ఉండ్రాళ్ల అభిషేకం నిర్వహించారు. తదనంతరం నిర్వహించిన గ్రామోత్సవాన్ని కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. రంగన్నగూడెం, కొత్తపల్లి, పెరికీడు, ఎస్.ఎన్.పాలెం, తదితర గ్రామాల్లో గణపతి నిమజ్జనోత్సవాలు నిర్వహించారు.

ఉయ్యూరు : వినాయక నిమజ్జనాలు ఆదివారం వైభవంగా నిర్వహిం చారు. పట్టణ పరిధిలో పలు చోట్ల ఏర్పాటు చేసిన వినాయక చవితి మండపాల్లో నవ రాత్రిపూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వీరమ్మ మెట్టినింటి సమీపాన ఏర్పాటు చేసిన వినాయక మండపం లో చివరి రోజు విశేష పూజలు చేసి మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ వినాయక ప్రతిమ ఊరేగించి పుల్లేరు కాల్వలో నిమజ్జనం చేశారు.

రూ. 41వేలు పలికిన లడ్డూ

వీరమ్మ మెట్టినింటి వద్ద వినాయక మండపంతో పాటు పలుచోట్ల నిర్వహించిన లడ్డూ వేలం పాటలో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీరమ్మ మెట్టినింటి వద్ద మండపంలో జరిగిన లడ్డూ వేలం పాటలో లడ్డూను భార్గవ్ రూ.41వేలకు దక్కించుకు న్నాడు. టీడీపీ నేతలు రాజులపాటి ఫణి, నెరుసు వీర కుమార్, నెరుసు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. చినఓగిరాల, మూర్తిరాజుగూడెం, పెదఓగిరాల, ముదునూరు, కాటూరు తదితర గ్రామాల్లో చివరి రోజు పూజల్లో గ్రామస్థులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

టీడీపీ మండల నాయకులు



ముక్కపాడులో వరద నీటిలో కుళ్లిపోయిన వరిపంటను పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

ఉంగుటూరు, సెప్టెంబరు 15 : వరదల కారణంగా పంటనష్టపోయిన ప్రతిరైతును సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందని టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి అన్నారు. మండలంలో ముంపునకు గురైన పొలాలను పరిశీలించి, నష్టపోయిన రైతులకు భరోసా కల్పించాలన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు పార్టీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి శని, ఆదివారాల్లో ముంపునకు గురైన ప్రాంతాల్లో పర్యటించారు. కొయ్యగూరపాడు, ఆముదాలపల్లి, లంకపల్లి, ముక్కపాడు, ఓంద్రంపాడు, వెల్దిపాడు, వేంపాడు, తరిగొప్పల, తదితర గ్రామాల్లో నీట మునిగిన పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరుమళ్ల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుపక్షపాత ప్రభుత్వమని, ఎవరూ అధైర్యపడవద్దన్నారు. మండల వ్యాప్తంగా ఈ ఏడాది 25, 300ఎకరాల విస్తీర్ణంలో రైతులు సార్వావరిసాగుచేసినట్లు, వరదముంపునకు సుమారు 7,200ఎకరాల్లో వరిపంట పూర్తిగా దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖాధికారులు తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఆళ్ల హనోక్, నాయకులు పోతినేని రామకృష్ణ, షణ్ముఖ్, ప్రసాద్, బుల్లబ్బాయ్, రంగారావు, కే రాంబాబు, కే గోపి, ఎన్ శివ, మద్దిరామయ్య, నాగేశ్వరరావు, విష్ణువర్ధన్‌రావు, రవీంద్ర, శివ, వీఏఏ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విప్లవాన్ని కొత్తపుంతలు తొక్కించిన ఏచూరి

ఆర్థిక విశ్లేషకులు గన్నె వెంకట్రావు



మాట్లాడుతున్న ఆర్థిక విశ్లేషకులు గన్నె వెంకట్రావు

గన్నవరం, సెప్టెంబరు 15 : విప్లవాన్ని కొత్తపుంతలు తొక్కించిన ఏచూరి అని ఆర్థిక విశ్లేషకులు గన్నె వెంకట్రావు అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ మల్లంపల్లి అంజనేయులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ, భారత ఎర్రజెండా ముద్దుబిడ్డ అని, మార్క్సిజాన్ని భారతీయ పరిస్థితులకు వర్తింపచేసి విప్లవ శక్తులను కొత్తపుంతలు తొక్కించడానికి విరామ మెరుగక కృషి చేసిన నిత్య శ్రామికుడు ఏచూరి అని కొనియాడారు. సామ్రాజ్యవాదం, మతోన్మాదంపై రాజీలేని యుద్ధం చేసిన పోరాటయోధుడు విశ్రమించాడని ఆవేదన వ్యక్తం చేసారు. భార్య సంపాదనతోనే జీవితం గడిపిన నిబద్ధత గల నేత అని చెప్పారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. బుద్ధవరం సర్పంచ్ బడుగు బాలమ్మ, పార్టీ నాయకులు పల్లం వెంకటేశ్వరరావు, అనుమోలు వెంకటేశ్వరరావు, మద్దుకూరు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జాతి గర్వించే సాంకేతిక శిఖరం మోక్షగుండం



మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ రంగామణి, ఆళ్ల గోపాలకృష్ణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 15 : నదులపై ఆనకట్టలు కట్టడంలో తన ప్రజ్ఞాపాటవాలతో బీళ్లను సైతం సస్యశ్యామలం చేసి ఇంజనీరింగ్ రంగంలో స్వయంకృషితో భారతదేశానికి కీర్తి కిరీటంలా నిలచిన సాంకేతిక శిఖరం మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని రాష్ట్ర సాగునీటి సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ కొనియాడారు. రంగన్నగూడెం పంచాయతీ ఆధ్వర్యంలో ఆదివారం భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా సర్పంచ్ కసుకుర్తి రంగామణితో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నీటిపారుదల రంగంలో ఆయన చేసిన సేవలతోనే సాగునీటి కొరత రాలేదన్నారు. తిరుమలకు మొదటి ఘాట్‌రోడ్డుకు అంకురార్పణ, విశాఖపట్నంలో సముద్రం వల్ల కోతకు గురికాకుండా చర్యలు తీసుకుని పోర్టు నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా సహకారం అందించిన మహనీయుడు మోక్షగుండం అని తెలిపారు. యువ ఇంజనీర్లు కూడా ఆయన స్ఫూర్తితో రాష్ట్ర జీవనాడి పోలవరంతో పాటు జలవనరుల ప్రాజెక్టులను పూర్తయ్యేలా సహకారమందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, మొవ్వా శ్రీనివాసరావు, తుమ్మల దశరథరామయ్య, నెరుసు వెంకటేశ్వరరావు, కనకవల్లి శేషగిరిరావు, నరసింహారావు, సీతారామయ్య, తదితర రైతులు పాల్గొన్నారు.

విశిష్ట సేవలందించిన పలువురికి అవార్డులు



మూర్తిని సత్కరిస్తున్న ప్రతినిధులు

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 15 : స్థానిక గ్రామీణ వైద్యుడు, సామాజిక కార్యకర్త కమ్మిలి వీరవెంకట సూర్యనారాయణమూర్తి జాతీయ స్థాయిలో నంది అవార్డు పొందారు. కాళోజీ తెలుగు బుక్‌ఆఫ్ రికార్డు, నేషనల్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆఫ్ న్యూఢిల్లీ సంయుక్తంగా ఆదివారం విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు జయంతి వేడుక సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకులు మూర్తికి అవార్డు అందించి సత్కరించారు.

గన్నవరం : సామాజిక సేవారంగంలో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఛైర్మన్ సంకాబత్తుల వెంకట్ చేస్తున్న సేవలను గుర్తించిన కాళోజి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ విత్ అసోసియేట్ నేషనల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆఫ్ న్యూఢిల్లీ జాతీయ స్థాయిలో నంది అవార్డును ఆదివారం విజయవాడ బాలోత్సవ భవన్‌లో అందజేసారు.

కంకిపాడు : కంకిపాడుకు చెందిన అడపాల ఉమామహేశ్వరరావుకు తెలుగు వెలుగు సాహితీ వేదిక నంది జాతీయ పురస్కారంతో ఆదివారం సత్కరించింది. విజయవాడ బాలోత్సవ భవన్‌లో ఆదివారం తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో చిత్ర కళా రంగంలో విశిష్ట కృషి చేసిన కృషికి సత్కరించారు.



వెంకట్‌ను సత్కరిస్తున్న సాహితీ వేదిక ప్రతినిధులు



అడపాల ఉమామహేశ్వరరావుకు సత్కారం

రియా ఆర్థో ఆసుపత్రిలో తక్కువ ధరకే సేవలు

ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్



రియా ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్

పెనమలూరు, సెప్టెంబరు 15 : రియా ఆర్థో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో తక్కువ ధరలకే వైద్య సేవలు అందుబాటులో ఉన్నట్లు ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్‌లు పేర్కొన్నారు. ఆదివారం కానూరు పంటకాల్వ రోడ్డు తులసీనగర్‌లో నూతనంగా నిర్మించిన రియా ఆర్థో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఎండీ డాక్టర్ కాట్రగడ్డ సాయికృష్ణకు అభినందనలు తెలిపారు. డాక్టర్ సాయికృష్ణ మాట్లాడుతూ, చిన్నపిల్లల ఎముకల సమస్యలు, వెన్నుపూస సమస్యలను అతి తక్కువ ధరలకే అత్యాధునిక యంత్ర సామగ్రితో నయం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఆసుపత్రి సేవలను కానూరు, ఆటోనగర్, సనత్‌నగర్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు పాల్గొన్నారు.

సీబీసీఎన్‌సీ స్కూల్ ప్రారంభం



స్కూల్‌ను ప్రారంభిస్తున్న తుమ్మల చంద్రశేఖర్, ముప్పా రాజా

కోలవెన్ను (కంకిపాడు), సెప్టెంబరు 15 : దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి చేయడం హర్షణీయమని కమ్మ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్, టీడీపీ నాయకులు తుమ్మల చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని కోలవెన్ను గ్రామంలో దాతల సహకారంతో పునః నిర్మించిన సీబీసీఎన్‌సీ స్కూల్‌ను ఆదివారం ఆయన పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు గ్రామస్థులు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోలవెన్ను సర్పంచ్ సురేష్, టీడీపీ, జనసేన పార్టీ సమన్వకర్త ముప్పా రాజా, గ్రామ పార్టీ అధ్యక్షుడు తుమ్మల చిన్ని, జగదీష్, రవీంద్ర, కంచకర్ల శేషగిరి, రామ్‌లక్ష్మణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధిత కుటుంబాలకు నిత్యావసరాలు



ఉయ్యూరు, సెప్టెంబరు 15 : కృష్ణానదికి ఇటీవల వరదల వల్ల నష్టపోయిన పాములలంక గ్రామానికి చెందిన విద్యార్థుల కుటుంబాలకు అమరవాణి స్కూల్ యాజమాన్యం నిత్యావసర సరుకులు ఆదివారం పంపిణీ చేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ పరసు నాగరాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన విద్యార్థుల కుటుంబాలు వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన పరిస్థితుల్లో తోచిన విధంగా సహాయం చేశామన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	129, 138, 149
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.35

నేడు ప్రజా దర్బార్ : మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 15 : మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ప్రజా సమస్య లను తీర్చేందుకే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి మచిలీపట్నం టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు సమస్యలను అధికారుల వద్దకు తీసుకుని వెళ్ళి పరిష్కార మార్గాలు చూపుతున్నామన్నారు. టీడీపీ నగర కార్యదర్శి పిప్పళ్ళ వెంకట కాంతారావు, టీడీపీ నాయకులు పి.వి. ఫణికుమార్, నల్లారి మురళీకృష్ణ, వాటాల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

అమరావతికి ఆర్టీసీ బస్సు నడపాలి : ఎమ్మెల్యే మండలి



కొత్త బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ : అవనిగడ్డ నుంచి రాష్ట్ర రాజధాని అమరావతికి ఆర్టీసీ బస్సు నడపాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. అవనిగడ్డ ఆర్టీసీ డిపోలో ఎనిమిది నూ తన బస్సులను ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. రాష్ట్ర రాజధాని అమరావతిలోని సచివాలయానికి వెళ్లే ప్రజల కోసం అవనిగడ్డ నుంచి అమరావతికి బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలని జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు అధికారి ఏ.వాణి దృష్టికి తీసుకెళ్లారు. మండలి వెంకట్రామ్, ఎంపీపీ తుంగల సుమతి, డిపో మేనేజర్ కొక్కిలిగడ్డ హనుమంతరావు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

కవులకు సీనియర్ సిటిజన్స్ వాయిస్ పురస్కారాలు



ప్రముఖ కవి తుమ్మల కృష్ణయ్యను సత్కరిస్తున్న డీఎస్పీ సుభాన్, గోపీచంద్ తదితరులు

మచిలీపట్నం టౌన్ : తెలుగు భాష మాధుర్యాన్ని కవులు కవితల ద్వారా తెలియచేయాలని మునిసిపల్ కమిషనర్ బాపిరాజు అన్నారు. బెల్ కంపెనీ ఆడిటోరియంలో ఆదివారం 50 మంది సుప్రసిద్ధ కవులకు సీనియర్ సిటిజన్స్ వాయిస్ అవార్డులను కమిషనర్ బాపిరాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్, డీఎస్పీ మహమ్మద్ అబ్దుల్ సుబాన్ అందజేశారు. రచయిత పునుకొల్లు సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవార్డుల ప్రదానోత్సవ సభకు ప్రముఖ కవి డాక్టర్ రాధాశ్రీ (హైదరాబాద్) అధ్యక్షత వహించారు. తెలుగు భాషను పాలనాభాషగా చేయాలని, ప్రాథమిక పాఠశాలల్లో తెలుగు మాధ్యమాన్ని పూర్తి స్థాయిలో ప్రవేశపెట్టాలని రచయితలు డిమాండ్ చేశారు. డాక్టర్ జనార్ధన్ (వరంగల్), మునిగోపాలకృష్ణ (మదనపల్లి), మల్లవరపు చిన్నయ్య (వరంగల్), తుమ్మల కృష్ణయ్య (గుడ్లవల్లేరు), ఎండీ సిలార్, కె. రాజేంద్రప్రసాద్, మాదిరెడ్డి వెంకటేశ్వరరావు, గరికపాటి ప్రభాకరరావు, బొందలపాటి సురేష్ తదితరులను సత్కరించారు.

ఇంజనీర్ మురళీధర్‌కు సత్కారం



మచిలీపట్నం టౌన్ : ఇంజనీర్లే దేశ నిర్మాతలని జిల్లా టీడీసీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. ఇంజనీర్స్‌డే సందర్భంగా ఆదివారం ఈడేపల్లి శ్రీరాములు మునిసిపల్ పార్కులో ప్రముఖ ఇంజనీరు ఆర్వీఎస్ మురళీధర్‌ను ఘనంగా సత్కరించారు. నంగేగడ్డ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గొర్రెపాటి గోపీచంద్, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన నాయకులు పి.వి.ఫణికుమార్, మైత్రీ ఫౌండేషన్ అధ్యక్షుడు వేణుకుమార్, చలమలశెట్టి పోతురాజు, డాక్టర్ బొల్లా ప్రసాద్, కాశీపట్నపు రఘు తదితరులు పాల్గొన్నారు. బాలాజీ విద్యాలయంలో భారతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఇంజనీర్స్‌డేలో ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణ, రాయపాటి మురళీధర్‌లను ఘనంగా సత్కరించారు.

యూటీఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభం

అవనిగడ్డ : సామాజిక సేవలో యూటీఎఫ్ ఘన కీర్తి కలిగి ఉందని ఎమ్మెల్యే మం డలి బుద్ధప్రసాద్ అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో యూటీఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లాస్థాయి క్రీడా పోటీలను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, మండలి వెంకట్రామ్ ప్రారంభించగా, వారిని ఘనంగా సత్కరించారు. యూటీఎఫ్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కెపి.ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు బి.కనకరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జె.లెనిన్ బాబు, గౌరవ అధ్యక్షులు నీలం ప్రభాకర్, నాయకులు షౌకత్ హుస్సేన్, మరీదు వరప్రసాద్, యూటీఎఫ్ జిల్లా, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

పర్యాటకులు మెరైన్ పోలీసుల సూచనలు పాటించాలి

కోడూరు : హంసలదీవి బీచ్ వద్దకు వచ్చే పర్యాటకులు మెరైన్ పోలీసు సూచనలు తప్పనిసరిగా పాటించాలని పాలకాయితిప్ప మెరైన్ ఎస్సై ఉజ్వల్ కుమార్ తెలిపారు. హంసలదీవి బీచ్ పర్యాటకులు సముద్ర స్నానాలు ఆచరించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తీరం వెంబడి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తమ సిబ్బందితో గస్తీ నిర్వహించారు. కోడూరు పోలీసు సిబ్బంది, మెరైన్ సిబ్బంది పాల్గొన్నారు.

సిద్ధినేని అశోక్ నాయుడుకు మండలి పరామర్శ

కోడూరు : అవనిగడ్డ నియోజకవర్గ చిరంజీవి యువత అధ్యక్షుడు, జనసేన నాయకుడు సిద్ధినేని అశోక్ నాయుడును ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరామర్శించారు. మాతృవియోగానికి గురైన అశోక్ నాయుడును ఉల్లిపాలెంలో పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ సభ్యుడు బండే శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకులు ఉల్లి శేషగిరిరావు, దామోర్ల నారాయణ, బచ్చు వెంకటేష్, గోగినేని బుజ్జి, కూటమి నాయకులు పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల





బందరు నుంచి వెళ్తున్న నిత్యావసర సరుకుల వాహనాలకు జెండా ఊపుతున్న రాజా, బాబాప్రసాద్



నిత్యావసర కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

అన్ని విధాలా ఆదుకుంటాం

నందివాడ (ఒద్దుల మెరక), సెప్టెంబరు 15 : వరద బాధితులందరినీ ఆదుకుంటామని ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఒద్దుల మెరక గ్రామ వరద బాధిత కుటుంబాలకు హెచ్‌సీఎల్ సంస్థ సమకూర్చిన 15 రకాల నిత్యావసర సరుకులను ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, బూరగడ్డ శ్రీకాంత్, దానేటి సన్యాసిరావు, చాట్రగడ్డ రవి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు. **గుడివాడ :** నందివాడ మండలంలోని వరద బాధితులకు గుడివాడ సైక్లింగ్ క్లబ్, మ్యాన్ కైండ్ ఫార్మా సంస్థలు 100 నిత్యావసర కిట్‌లను ఆదివారం అందజేశారు. సైక్లింగ్ క్లబ్ సభ్యుడు డాక్టర్ మాగంటి శ్రీనివాస్ క్లబ్ సభ్యులు డా.సూరజ్, డా.శ్రీనాథ్, డా.శ్రావ్య, క్లబ్ పెద్దలు శాస్త్రి, హరీష్, గుప్తా, మోనీష్, గ్రామ పెద్దలు శివయ్య, మ్యాన్‌కైండ్ ఫార్మా సభ్యులు పాల్గొన్నారు. **గుడివాడ రూరల్ :** గుడివాడ శ్రీ స్టార్ షైనింగ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నందివాడలో వరద బాధితులకు లింగమనేని జగదీష్, లింగమనేని స్రవంతి ఆధ్వర్యంలో కూరగాయలు పంపిణీ చేశారు. **తోట్లవల్లూరు :** కృష్ణానది వరదతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు తగిన పరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. రొయ్యూరు శివారు తోడేళ్ళదిబ్బలంక, వల్లూరుపాలెం శివారు కాళింగదిబ్బలంకలో ఆదివారం 250 కుటుంబాలకు టీడీపీ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల కిట్లను ఎమ్మెల్యే అందించారు. వరద ముంపున గురై దెబ్బతిన్న పంటలను ఎమ్మెల్యే కుమార్ రాజా పరిశీలించారు. సీఎం చంద్రబాబునాయుడు ఇప్పటికే వరికి ఎకరాకు రూ 10 వేల సహాయాన్ని ప్రకటించారని, ఇతర పంటలకు కూడా తగిన పరిహారాన్ని ప్రకటిస్తారని కుమార్ రాజా చెప్పారు. టీడీపీ నాయకులు వీరంకి వెంకట గురుమూర్తి, ఉప్పులూరి గోపాలకృష్ణ, నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్ తదితరులు పాల్గొన్నారు. దేవరపల్లి శివారు పొట్టిదిబ్బలంకలో 65 మంది వరద బాధితులకు ఉపాధ్యాయుడు వి.శ్రీనివాసప్రసాద్ ఆ యన స్నేహితులు జగదీష్, ఎస్.పోతురాజు, ఎం.మాధవరావు, కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు, లుంగీలు, టవల్, చీరలు, బిస్కెట్ ప్యాకెట్లను అందించారు. ఉపాధ్యాయులు సీహెచ్ మైథిలి, ఎం.విజయశ్రీ పాల్గొన్నారు. **నాగాయలంక :** శ్రీ సుధా క్లాత్ షోరూమ్ అధినేత గోలి కోటేశ్వరరావు కుటుంబసభ్యుల దాతృత్వం అభినందనీయమని ఆం ధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు అన్నారు. వరద ముంపు బాధితులకు గోలి కుటుంబసభ్యులు సుధాకర్, సన్ముఖి, అందె మధుసూదనరావు, బిట్ర వెంకటేశ్వరరావు సమకూర్చిన దుప్పట్లు, బిస్కెట్ ప్యాకెట్లను లంకే శ్రీనివాస ప్రసాద్, కర్రి కృష్ణమూర్తి కలసి 90 కుటుంబాలకు అందజేశారు. డోకిపర్తి నాగేశ్వరరావు, కొల్లు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ జనసైనికుల ఔదార్యం స్ఫూర్తిదాయకం



అవనిగడ్డ రూరల్ : ఎన్ఆర్ఐ జనసైనికుల సేవలు స్ఫూర్తిదాయకమని జనసేన నేత మండలి వెంకట్రామ్ అన్నారు. రేగుల్లంకలో వితంతు మహిళ దిడ్ల సుశీల, ఆమె కుమార్తె పవిత్ర నివాసాన్ని మండలి వెంకట్రామ్ పరిశీలించారు. సుశీల ఇల్లు వరదలకు దెబ్బతినటంతో జనసైనికులు లేబాక శ్యాం కుమార్ - శ్రీ లావణ్య దంపతులు ఎన్ఆర్ఐ జనసేన నాయకులు ఇం దుర్తి సునీల్, రమా మార్త దృష్టికి తీసుకెళ్లగా, రూ.50 వేలతో గృహానికి మరమ్మతులు చేయించి రం గులు, సీలింగ్ ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేసి అండగా నిలిచారు. దాతలను వెంకట్రామ్ అభినందించారు. గుడివాక శేషుబాబు, తుంగల నరేష్, మండలి శివప్రసాద్, మండలి ఉదయ్, రామ్మోహన్‌రావు, గుంటూరు వినయ్, మండలి సుధీర్, బుజ్జిబాబు, కమ్మిలి సాయి భార్గవ పాల్గొన్నారు.

బందరు నుంచి విజయవాడ వరద బాధితులకు నిత్యావసర సరుకులు

మచిలీపట్నం టౌన్ : బుడమేరు వరద ముంపు బాధితులకు ఆదివారం గరుడ సేవా సమి తి ప్రతినిధులు సామా కుమారి, చిట్టి కుమారి పెద్ద ఎత్తున నిత్యావసర వస్తువులు, దుప్పట్లు, దుస్తులు పంపారు. మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. విజయవాడకు రాష్ట్ర శిష్టకర్ణ సాధికార సమితి కన్వీనర్ అక్కుమహంతి రాజా ఆధ్వర్యంలో బియ్యం, నిత్యావసర వస్తువులు, కూరగాయలు తీసుకుని వెళ్లారు. డీఎస్పీ బి. నాగేశ్వరరావు, బి. శివకుమార్ పట్నాయక్, బలివాడ సత్యారావు, ప్రతాపరావు, బాసంగి తిరుమలరావు, శ్రీనివాసరావు, సదాశివుని వెంకటేశ్వరరావు, వీణం అయ్యప్ప, బండార్లంక వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న సీఐ ఈశ్వరరావు చిత్రంలో సర్పంచ్ కృష్ణకుమారి, డీఆర్కే దంపతులు

స్వచ్ఛ చల్లపల్లి స్ఫూర్తిదాయకం

చల్లపల్లి : స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమం స్ఫూర్తిదాయకం అని సీఐ కె.ఈశ్వరరావు అన్నారు. 3234 రోజులుగా నిర్విరామంగా జరుగుతున్న స్వచ్ఛ సేవాయజ్ఞంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. స్వచ్ఛ కార్యకర్తలతో కలిసి పనులుచేశారు. మొక్కను నాటారు. సీఐ మాట్లాడుతూ, స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమంలో పాల్గొని కార్యకర్తలతో కలిసి సేవలందించటం సంతోషాన్ని కలిగించిందన్నారు. డీఆర్కే దంపతుల ఆధ్వర్యంలో పదేళ్లుగా స్వచ్ఛసేవలు కొనసాగించటం సామాన్యమైన విషయం కాదన్నారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, స్వచ్ఛ చల్లపల్లి సారథులు డాక్టర్ డీఆర్‌కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతిలు, పలువురు ప్రముకులు పాల్గొన్నారు.



సాంబశివరావు మాస్టారుకు లయన్స్‌క్లబ్ సన్మానం

చల్లపల్లి : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న చల్లపల్లి రాజా కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్, లయన్స్‌క్లబ్ జిల్లా ప్రముఖుడు టి.సాంబశివరావును చల్లపల్లి లయన్స్‌క్లబ్ ప్రతినిధులు సన్మానించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రాయపాటి రాధాకృష్ణ, కస్తూరి వెంకట వరప్రసాద్, కోశాధికారి ముమ్మనేని నాని, పెద్దలు నర్రా సాయిబాబు, ఎస్‌జిఎ.భాషా, వరదా హరిగోపాల్, ఎంవి.కృష్ణారావు, కంఠంనేని సుధాకరరావు, ఉప్పల సాంబశివరావులు పురస్కారగ్రహీత సాంబశివరావును పూలమాలలు, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.

బావిశెట్టి రమేష్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



చల్లపల్లి : మండలం కొత్త మాజేరుకు చెందిన లయన్ డాక్టర్ బావిశెట్టి రమేష్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఎంఈడీ ప్రాస్పరిటీ అసోసియేషన్ (ఏపీఎంపీఏ) ఆధ్వర్యంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని విజయవాడలో జరిగిన కార్యక్రమంలో బావిశెట్టి రమేష్‌ను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానందరెడ్డి, యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు, నాగార్జున యూనివర్శిటీ ప్రొఫెసర్ స్వరూపరాణి, కృష్ణాయూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ శైలజ, సిద్దార్థ కాలేజీ ప్రిన్సిపాల్ శేషశ్రీ తదితరులు పాల్గొని డాక్టర్ బావిశెట్టి రమేష్‌ను సన్మానించారు. రమేష్ ప్రస్తుతం గుంటూరు ఆర్‌వీఆర్ఆర్ కాలేజ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.



రైతులకు నష్టపరిహారం వెంటనే అందించాలి

కూచిపూడి : పంట దెబ్బతిన్న రైతాంగాన్ని ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కోసూరు గ్రామంలో దెబ్బతిన్న వరి పొలాలను ఆదివారం పరిశీలించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, పురుగు మందులు ఉచితంగా అందించాలన్నారు. ఎరువుల దుకాణాల్లో డీఏపీ కొంటేనే యూరియా ఇస్తామని వ్యాపారస్థులు మెలిక పెడుతున్నారని, వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మొవ్వ మండలంలో వేలాది ఎకరాల్లో వరి పంటకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకునేందుకు అన్ని విధాలుగా చర్యలు చేపట్టాలని నారాయణరావు కోరారు.

అప్సా (డెమొక్రటిక్) కార్యవర్గం

నందివాడ : గుడివాడ డివిజన్ అప్సా (డెమొక్రటిక్) 2024-26 కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా అర్జా ప్రసాద్, కార్యదర్శిగా లింగమనేని జగదీష్, కోశాధికారిగా లంకపల్లి శ్రీనివాస్, గౌరవాధ్యక్షులుగా అర్జా వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా పి.దామోదర్ , ఎం.నరసింహారావు, తోట సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శిగా ఎస్.శారద, కార్యవర్గ సభ్యులుగా లింగమనేని స్రవంతి, టి.శోభాకుమారి, టి.వి రమణకుమారి, హేమంత్‌రెడి, శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేశారు. గురుపూజోత్సవం సందర్భంగా 14 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. నూతన కార్యవర్గాన్ని అప్సా డెమొక్రటిక్ ఛైర్మన్ గొల్లపూడి మోహనరావు, ఎన్నికల అధికారి చెన్నంశెట్టి కృష్ణ, జిల్లా అధ్యక్షుడు పుట్టి రామచంద్రశేఖర్, రాష్ట్ర అధ్యక్షుడు సబ్బినేని శ్రీనివాస్, ఎన్నికల కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, కైకలూరు డివిజన్ అధ్యక్షుడు ఏ.వి కోటేశ్వరరావు, ఏలూరు కార్యదర్శి టి.కనకదుర్గ భవాని, జి.సత్యనారాయణ తదితరులు అభినందించారు.,

వైభవంగా గణేష్ నిమజ్జనోత్సవం



పామర్రు : వివిధ ప్రదేశాల్లో గణేశ్ నవరాత్రుల అనంతరం విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. పామర్రు 18వ వార్డులో చిన్నారులు ఏర్పాటు చేసిన బాలగణనాధుని విగ్రహ నిమజ్జన వేడుక సందడిగా జరిగింది. పుల్లేటి కాల్వలో విగ్రహాలను నిమజ్జనం గావించారు. తొలుత భక్తులకు అన్నదానం చేశారు. గణేష్ లడ్డూ ప్రసాదాన్ని రూ.30,116కు టి.చక్రీకవల్లి అనే విద్యార్థిని దక్కించుకుంది. భక్తులకు ఎలాంటి అసౌకార్యం కలగకుండా ఎస్సై అవినాష్ బందోబస్తు నిర్వహించారు. **పెడన :** జగపతి సినిమా హాలు వీధిలోని చవితి పందిరి వద్ద బాల గణపతి కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. పెద్ద ఎత్తున అన్న సమారాధన జరిగింది. తోట గంగయ్య లడ్డూ ప్రసాదాన్ని రూ. 31 వేలకు సొంతం చేసుకున్నాడు. నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది. పత్తిపాటి వారి వీధిలో బాలగణపతి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం నిమజ్జనోత్సవం వైభవంగా జరిగింది. **అవనిగడ్డ రూరల్ :** మోదుమూడి రామాలయంలో యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడు ఊరేగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు. బచ్చు ఆదినారాయణ, ప్రముఖులు పాల్గొన్నారు. మండలిపురం, ఒకటో వార్డుల్లో వినాయకుల నిమజ్జనం వైభ వంగా జరిగింది. మండలిపురంలో నిమజ్జన కార్యక్రమాన్ని పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాస్ ప్రారంభించారు.

గణనాథుని లడ్డూ రూ.75 వేలు

అవనిగడ్డ రూరల్ : రామచంద్రపురంలో వినాయకుడి లడ్డూ ప్రసాదాన్ని భక్తులు కమ్మిలి కృష్ణమూర్తి మనుమవళ్లు ముద్దునేని మురళీ, కమ్మిలి మారుతి సాయి రూ.75 వేలకు దక్కించుకున్నారు. కమిటీ పెద్దలు వారిని సత్కరించి లడ్డూ అందజేశారు.

భారీ అన్నసమారాధన

ఘంటసాల : శ్రీకాకుళం గ్రామంలో సోమవారం కరకట్టపై వినాయకుడి ఆలయంలో గణేష్ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన అన్న సంతర్పణ కార్యక్రమాన్ని మండలి వెంకట్రామ్ (రాజా) ఆదివారం ప్రారంభించారు. మండలి వెంకట్రామ్, ఘంటసాల ఎస్సై ప్రతాప్ రెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం వారిని ఎంపీటీసీ సభ్యుడు తాడికొండ వెంకటేశ్వరరావు, జనసైనికులు, కమిటీ పెద్దలు సత్కరించారు. ఆయల కమిటీ సభ్యులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **నందివాడ (పోలుకొండ) :** వినాయకుని నవరాత్రుల సందర్భంగా పోలుకొండ చిన వంతెన దగ్గర సుమారు రెండు వేల మందికి అన్నసమారాధన నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అవాంఛనీయ సంఘటను జరగకుండా చర్యలు : ఎస్పీ

బంటుమిల్లి : వినాయక నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని ఎస్పీ ఆర్. గంగాధరరావు ఆదివారం అన్నారు. మండలం లోని బంటుమిల్లి ప్రధాన కాలవ వద్ద గల నిమజ్జన ఘాట్‌ను పరిశీలించారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. చిన్నారులను నిమజ్జన కార్యక్రమాల్లో అనుమతించరాదని పోలీసులకు సూచించారు. ఏర్పాట్లపై బంటుమిల్లి ఎస్సై గణేష్‌ను, సిబ్బందిని ఆయన అభినందించారు.

అలరించిన సీతారాముల కల్యాణం హరికథ

నాగాయలంక : ప్రసన్న గణపతి ఆలయ ప్రాంగణంలో భీమవరానికి చెందిన ప్రముఖ హరికథకుడు పాల రామాంజనేయులు గానం చేసిన సీతారాముల కల్యాణం హరికథ అలరించింది. పి.ఆంజనేయులు, ఎం.నగధరరావు వాయిద్య సహకారాన్ని అందించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెడన, సెప్టెంబరు 15 : ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెదనందమూరు గ్రామానికి చెందిన డి. నాగరాజు (24) వాయిదాల పద్ధతిలో ద్విచక్ర వాహనాన్ని కొనుగోలు చేశాడు. వాయిదాలు సక్రమంగా చెల్లించకపోవడంతో వాహనాన్ని కంపెనీ ప్రతినిధులు తీసుకువెళ్లిపోయారు. మనస్తాపం చెందిన నాగరాజు ఈనెల 10న గ్రామంలోని చెరువు వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. బంధువులు అతన్ని విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూనే శనివారం రాత్రి నాగరాజు మృతిచెందాడు. తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువుల యజమానుల పైపులు

చెన్నూరు రైతుల ఆందోళన

పెడన రూరల్ : చెన్నూరులో పెదలంక డ్రెయిన్‌కు అనుసంధానంగా పైపులైన్ వేయటంతో సమీప పొలాల రైతులు ఆందోళన చెందుతున్నారు. చేపల చెరువుల యజమానులు బోదెలు మూసివేస్తూ ఐదారడుగుల లోతులో పైప్‌లు ఏర్పాటు చేస్తున్నప్పటికీ ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు తెలిపారు. తూముల ఏర్పాటుతో వంద ఎకరాలు ముంపునకు గురౌతాయని రైతులు తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం

నాగాయలంక : వేకనూరుకు చెందిన లింగం అనిల్ కుమార్ వద్ద 50 అక్రమ మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

ఫిష్ ల్యాండ్‌లో చేపలపై విష ప్రయోగం

మోపిదేవి : కందుల గోపాలం (నాని)కు చెందిన ఫిష్ ల్యాండ్‌లో సమీప బంధువులే విష ప్రయోగం చేసి ఆర్థికంగా నష్టపర్చినట్లు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. రూ.25 వేలు విలువ చేసి 180 కిలోల చేపలు చనిపోగా, బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం



లెటర్ రిపీటెడ్ సిరీస్

రీజనింగ్

వివిధ రకాలైన సిరీస్ పద్ధతులు:

1. **abc/bca/cab/abc.**
మొదటి సమూహంలో చివరి రెండు అక్షరాలు రెండో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, మొదటి సమూహంలో మొదటి అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. రెండో సమూహంలో చివరి రెండు అక్షరాలు మూడో సమూహంలో మొదటి రెండు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. ఈ విధంగా ఒక క్రమపద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
2. **aaa/bbb/ccc/aaa**
ప్రతి సమూహంలో ఒక అక్షరమే మూడుసార్లు ఉన్నది.
3. **acac/abab/acac/abab**
acac/abab అనే అక్షరాల సమూహాలు రెండుసార్లు రిపీట్ అయ్యాయి.
4. **ab/aab/aaab/aaaab**
రెండో సమూహాన్ని పరిశీలిస్తే రెండో సమూహం నుంచి ప్రతి సమూహంలోను దాని ముందు సమూహంలోని అక్షరాలతోపాటు ఒక 'a' అదనంగా చేరుతున్నది.
5. **abca/abcb/abcc/abca**
ప్రతి సమూహంలోను మొదటి మూడు అక్షరాలుగా abcలే రిపీట్ అయ్యాయి. మొదటి సమూహంలో చివరి అక్షరంగా a, రెండో సమూహంలో చివరి అక్షరంగా b, మూడో సమూహంలో చివరి అక్షరంగా c ఉన్నది. ఈ విధంగా కచ్చితమైన పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
6. **abcd/bcda/cdab/dabc/adcb.**
మొదటి సమూహంలో చివరి మూడు అక్షరాలు రెండో సమూహంలో మొదటి మూడు అక్షరాలుగా, మొదటి సమూహంలో ఒకటో అక్షరం రెండో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. రెండో సమూహంలో చివరి మూడు అక్షరాలు మూడో సమూహంలో మొదటి మూడు అక్షరాలుగా, రెండో సమూహంలో మొదటి అక్షరం మూడో సమూహంలో చివరి అక్షరంగా ఉన్నది. ఈ విధంగా ఒక సక్రమమైన చెయిన్ పద్ధతిని ఈ సిరీస్ అనుసరించింది.
7. **PQQ/QRR/RPP/PQQ**
ప్రతి సమూహంలో చివరి రెండు అక్షరాలు ఒకటే.
8. **aab/bbc/cca/aab**
ప్రతి సమూహంలో మొదటి రెండు అక్షరాలు ఒకటే.
9. **ab/abb/abbb/abbbb**
రెండో సమూహాన్ని పరిశీలిస్తే రెండో సమూహం నుంచి ప్రతి సమూహంలోను దాని ముందు సమూహంలోని అక్షరాలతో పాటు ఒక 'b' అదనంగా చేరుతున్నది.

ప్రతి సమూహంలో ఒకే విధమైన అక్షరాలు రిపీట్ అవుతున్నాయి. ఇలాంటి సందర్భాలలో ప్రశ్నలకు సమాధానం రాబట్టడానికి కింద తెలిపిన విధానాన్ని అనుసరించవచ్చు.

ఉదా: P - R - Q - P Q - - Q R

ఎ) QPRPR బి) QPRRP

సి) QRPQP డి) ఏదీకాదు

పై ఉదాహరణలో అక్షరాలు, ఖాళీలు మొత్తం 12 ఉన్నాయి. 12 ఉంటే 3 లేదా 4 స్థానాలను ఒక సమూహంగా విభజించాలని తెలియపరచడం జరిగింది గమనించండి.

ముందుగా తక్కువ స్థానాలుగా అంటే 3 స్థానాలుగా విభజించాలి. సరిచూసిన తదుపరి కచ్చితమైన సమాధానం రావడానికి అవకాశం లేనప్పుడు ఎక్కువ స్థానాలుగా అంటే 4 స్థానాలుగా విభజించుకోవాలి.

మొదట మూడేసి అక్షరాలను ఒక్కొక్క సమూహంగా విభజిస్తే P - R / - Q - / PQ - / - QR.

విభజించిన తరవాత గమనించిన మొదటి, మూడో సమూహంలో మొదటి అక్షరం P ఉన్నది. అందువల్ల రెండు, నాలుగు సమూహంలో మొదటి అక్షరం 'P' అవుతుంది. ఇప్పుడు రెండు, నాలుగు సమూహాల్లో మొదటి అక్షరంగా 'P' ఉంచినప్పుడు పై అక్షర క్రమం (లెటర్) కింది విధంగా ఏర్పడుతుంది.

P - R / PQ - / PQ - / PQR

ఇప్పుడు మళ్లీ గమనిస్తే రెండు, మూడు, నాలుగు సమూహాల్లో రెండో అక్షరంగా 'Q' ఉన్నది. కాబట్టి మొదటి సమూహంలో కూడా రెండో అక్షరం 'Q' అవుతుంది. ఇప్పుడు మొదటి సమూహంలో 'Q'ను ఉంచితే పై అక్షర క్రమం(లెటర్ సిరీస్) కింది విధంగా ఏర్పడుతుంది.

PQR /PQ - / PQ - / PQR

ఇప్పుడు మళ్లీ గమనిస్తే మొదటి, నాలుగు అక్షర సమూహంలో మూడో అక్షరంగా R ఉన్నది. అందువల్ల రెండు, మూడో సమూహంలో కూడా మూడో అక్షరం R అవుతుంది. ఇప్పుడు రెండు, మూడో సమూహంలో మూడో అక్షరంగా R ఉంచితే పై అక్షర క్రమం (లెటర్ సిరీస్) కింది విధంగా ఏర్పడుతుంది.

PQR / PQR / PQR /PQR

ఇప్పుడు అక్షర క్రమం పూర్తి అయింది. పైన ఖాళీలలో గల అక్షరాలు QPRRP ఇది సమాధానం అవుతుంది. ఆప్షన్స్‌లో QPRRP అనేది (బి)లో ఉన్నది. సమాధానం (బి) అవుతుంది.

మిగిలిన 6 నుంచి 18 వరకు ఉన్న పద్ధతుల్లో ఐచ్ఛికాల్లో ఇచ్చిన అక్షరాలను ఖాళీల్లో పెట్టుకొని జాగ్రత్తగా పరిశీలించి సమాధానాన్ని కనుగొనాలి. కాబట్టి ఇచ్చిన వివిధ రకాలైన సిరీస్ పద్ధతులను వీలైనన్ని ఎక్కువసార్లు గమనించి దాని కింద ఇచ్చిన వివరణల ఆధారంగా అవి ఏర్పడే విధానాలను అవగాహన చేసుకొని ఈ చాప్టర్‌లోని ప్రశ్నలకు సమర్థవంతంగా సమాధానాలు గుర్తించండి.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

దిక్సూచి
DIKSUCHI

గ్రూప్-1 మెయిన్స్ ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ



ఇండియా వర్సెస్ భారత్
ఒక దేశం రెండు పేర్లు

భారత్ అనే పేరును రాజ్యాంగంలో చేర్చాలని 1949 సెప్టెంబరు 18న నిర్వహించిన రాజ్యాంగ పరిషత్ సమావేశంలో కొందరు సభ్యులు కోరారు. 74 సంవత్సరాలు గడిచిన తరవాత కూడా ఆ చర్చ కొనసాగుతూనే ఉంది. 2023లో భారతదేశంలో కీలకమైన జీ-20 శిఖరాగ్ర సమావేశాల ప్రారంభ సన్నాహాల సందర్భంగా జరిగిన సంఘటనలు/ చర్చలతో ఈ డిమాండ్ మళ్లీ తెరపైకి వచ్చింది.

అయితే ఈసారి చర్చను పరిష్కరించే అంబేద్కర్ లేరు. 2023 సెప్టెంబరులో జీ-20 సమావేశాల సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీ-20 అతిథులకు పంపిన అధికారిక విందు ఆహ్వానంలో 'ద ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా'కు బదులు 'ద ప్రెసిడెంట్ ఆఫ్ భారత్' అని ముద్రించారు. సమావేశాలు నిర్వహించిన ప్రదేశానికి 'భారత మండపం' అని పేరు పెట్టారు. సమావేశాల్లో ప్రధాని ముందున్న నేమ్‌ప్లేట్‌పై భారత్ అని పేర్కొన్నారు. దీంతో 2023 సెప్టెంబరు 18న ప్రారంభమైన పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ఇండియా పేరును భారత్‌గా అధికారికంగా రాజ్యాంగ సవరణ ద్వారా మార్చగలరనే ఊహాగానాలకు దారితీసింది. దీంతో ఒక్కసారిగా ఇండియా/భారత్ అనే పదాలపై ఒకింత ఆసక్తికరమైన చర్చ ప్రజాబాహుళ్యంలోకి వచ్చింది.

గతంలో ఈ అంశంపై మూడుసార్లు సుప్రీంకోర్టులో కేసులు దాఖలైనప్పటికీ, రాజ్యాంగ పరిషత్‌లో తప్ప మళ్లీ ఇంత పెద్ద ఎత్తున ప్రజాబాహుళ్యంలో ఎప్పుడూ చర్చకు రాలేదు. అయితే అందరూ ఊహించినట్లుగా పార్లమెంటులో ఈ అంశంపై ఎలాంటి తీర్మానం ప్రవేశపెట్టకపోవడం గమనార్హం. ఈ సందర్భంగా ఈ అంశంపై రాజ్యాంగ పరిషత్‌లో జరిగిన చర్చల నుంచి నేటివరకు జరిగిన పరిణామాలను ఒకసారి పరిశీలిద్దాం.

రాజ్యాంగ పరిషత్ 1946 డిసెంబరు 9న మొట్టమొదటిసారిగా సమావేశమైనప్పటికీ 1949 సెప్టెంబరు 18 వరకు దేశానికి ఒక 'పేరు'ను ఖరారు చేయలేకపోయింది. దేశానికి పేరుపెట్టే అంశాన్ని కేంద్ర (యూనియన్) రాజ్యాంగ కమిటీకి ఇచ్చింది. ఈ కమిటీ 1947 జూలై 4న జారీ చేసిన నివేదిక ప్రకారం 'ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' పేరును నిర్ణయించారు.

రాజ్యాంగ రచన విధానం

రాజ్యాంగాన్ని రూపొందించడం చాలా క్లిష్టమైన పని. సంక్షిప్తంగా చెప్పాలంటే రాజ్యాంగ పరిషత్ సభ్యులు ముందుగా రాజ్యాంగంలో ఏయే నిబంధనలను రూపొందించాలనే విషయాలను పరిశీలించి నివేదించడానికి అనేక కమిటీలను ఏర్పాటు చేశారు. తదనంతరం ఈ కమిటీలు తమ నివేదికలను సమర్పించాయి. వీటి ఆధారంగా వివిధ నిబంధనలను రూపొందించారు. వీటిని ఉపయోగించి రాజ్యాంగ సలహాదారు సర్ బి.ఎన్.రావు రాజ్యాంగ ముసాయిదాను సిద్ధం చేశారు. ఆ తరవాత ముసాయిదాను డ్రాఫ్టింగ్ కమిటీకి పంపారు. అది దానిపై చర్చించి అవసరమైన మార్పులు, చేర్పులను చేసింది. సవరించిన ముసాయిదాను అసెంబ్లీ, ప్రావిన్షియల్ లెజిస్లేచర్లు, ప్రావిన్షియల్ ప్రభుత్వాలు, మంత్రిత్వశాఖలు, ఫెడరల్ కోర్టు, హైకోర్టు సభ్యులకు పంపడంతోపాటు ప్రజల నుంచి విన్నపాలు స్వీకరించడానికి అందుబాటులో ఉంచారు. వారు తమ సూచనలను సమర్పించారు. ఆ తరవాత ముసాయిదా కమిటీ ఛైర్మన్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ దీనిని రాజ్యాంగ పరిషత్ అధ్యక్షునికి సమర్పించారు. ముసాయిదా రాజ్యాంగంపై సుదీర్ఘంగా చర్చించి, దానికి మార్పులు, చేర్పులు చేశారు. ఈ సవరణల ఫలితంగా భారత రాజ్యాంగం రూపుదిద్దుకుంది.

'భారత రాజ్యాంగంలో రాష్ట్రాల యూనియన్' అనే భావన కెనడియన్(బ్రిటిష్ నార్త్-అమెరికన్) చట్టం నుంచి స్వీకరించారు. బలమైన కేంద్రంతో కూడిన సమాఖ్యను ఏర్పర్చడానికి రాజ్యాంగంలో 'రాష్ట్రాల యూనియన్' అనే పదాలను పొందుపరిచారు.

రాజ్యాంగ పరిషత్ 1946 డిసెంబరు 9న మొట్టమొదటిసారిగా సమావేశమైనప్పటికీ 1949 సెప్టెంబరు 18 వరకు దేశానికి ఒక 'పేరు'ను ఖరారు చేయలేకపోయింది. దేశానికి పేరుపెట్టే అంశాన్ని కేంద్ర(యూనియన్) రాజ్యాంగ కమిటీకి ఇచ్చింది. ఈ కమిటీ 1947 జూలై 4న జారీ చేసిన నివేదిక ప్రకారం 'ఫెడరేషన్ ఆఫ్ ఇండియా' పేరును నిర్ణయించారు.

'భారత రాజ్యాంగంలో రాష్ట్రాల యూనియన్' అనే భావన కెనడియన్(బ్రిటిష్ నార్త్-అమెరికన్) చట్టం నుంచి స్వీకరించారు. బలమైన కేంద్రంతో కూడిన సమాఖ్యను ఏర్పర్చడానికి రాజ్యాంగంలో 'రాష్ట్రాల యూనియన్' అనే పదాలను పొందుపరిచారు.

భరత్‌వర్ష్ అని పేర్కొనాలి

ఆర్టికల్-1(1) కింద ఈ రాజ్యాంగం ప్రారంభమైన తేదీ నుంచి ఇండియా ఒక సమాఖ్యగా ఉంటుందని సలహాదారు సర్ బి.ఎన్.రావు పేర్కొన్నారు. అయితే బి.ఎన్.రావు ముసాయిదా పంపిణీ చేసినప్పుడు ఈ రాజ్యాంగం ప్రారంభం నుంచి భారతదేశం రాష్ట్రాల యూనియన్‌గా ఉంటుందన్న వివరణను చేర్చాలని కేంద్ర రాజ్యాంగ కమిటీ సిఫార్సు చేసింది. ఈ సిఫార్సును చివరికి ముసాయిదా కమిటీ రూపొందించిన రాజ్యాంగ ముసాయిదాలో చేర్చారు. ఈ ముసాయిదాను సభ్యులకు సర్క్యులేట్ చేసినప్పుడు ఉపేంద్రనాథ్ బర్మన్ ఇండియాకు బదులుగా 'భరత్‌వర్ష్' అనే పదాన్ని డ్రాఫ్ట్ అంతటా ఉపయోగించాలని కోరారు. ఈ సూచనను ముసాయిదా కమిటీ తిరస్కరించింది. కారణం ఇండియా అనే పదం ప్రస్తుతం ఒకటిన్నర శతాబ్దాలకు పైగా వాడుకలో ఉండటమే కాకుండా అంతర్జాతీయంగా కూడా ప్రసిద్ధి చెందింది. కాబట్టి ముసాయిదా అంతటా దానిని భరత్ వర్ష్‌గా మార్చడం మంచిది కాదని రాజ్యాంగ పరిషత్‌కు సమర్పించిన చివరి ముసాయిదాలో ఇండియా అనే పదాన్ని ఉపయోగించారు.

ఆర్టికల్-1 : ఇండియా అది భారత్: ఆర్టికల్-1పై రాజ్యాంగ పరిషత్‌లో సుదీర్ఘంగా చర్చ జరిగింది. శిబ్బన్‌లాల్ సక్సేనా ఇండియాను భరత్‌వర్ష్ అని సంబోధించేలా అనేక సవరణలను ప్రవేశపెట్టారు. ఉదాహరణకు 1948 నవంబరు 15న 'యూనియన్ పేరు భారత్' అని ఒక సవరణను ప్రవేశపెట్టారు. అలాగే రాజ్యాంగ అధికారులను కాన్‌స్టిట్యూషనల్ ఆఫీసర్స్ ఆఫ్ ఇండియాగా కాకుండా, కాన్‌స్టిట్యూషనల్ ఆఫీసర్స్ ఆఫ్ భారత్‌గా సంబోధించాలని కోరారు. అదేవిధంగా చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియాను చీఫ్ జస్టిస్ ఆఫ్ భారత్‌గా సంబోధించాలని సవరణలను ప్రవేశపెట్టారు. అయితే ఆయన ప్రవేశపెట్టిన సవరణ తీర్మానాలన్నింటినీ రాజ్యాంగ పరిషత్ తిరస్కరించింది.

- 1949 సెప్టెంబరు 17న రాజ్యాంగ పరిషత్ సభా సమావేశం ముగియడానికి అరగంట మాత్రమే మిగిలి ఉంది. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఇండియా అనే పేరును తాను ఇష్టపడతానని స్థిరంగా పేర్కొన్నాడు. చరిత్ర అంతటా, గత సంవత్సరాల్లో భారతదేశాన్ని ఇండియాగా పిలిచేవారు. 'యుఎన్'లో సభ్యునిగా మన దేశం పేరు ఇండియా అని అనేక అంతర్జాతీయ ఒప్పందాలపై ఇండియా అనే పేరుతోనే సంతకం చేసిందని పేర్కొన్నాడు. అయితే ఆశ్చర్యకరంగా 1949 సెప్టెంబరు 17న ఆర్టికల్ '1'ని సవరిస్తూ 'ఇండియా అది భారత్' అని సవరణను ప్రవేశపెట్టారు. ఈ మార్పుపై డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఎలాంటి వివరణను ఇవ్వలేదు.



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్



నవ్యాంధ్ర టూవీలర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత సేవా శిబిరం



విజయవాడలోని వరద ప్రభావిత రాజీవ్‌నగర్‌లో తాగునీటి సరఫరా



వైఎస్సార్ కాలనీలో ఇంటిని శుభ్రం చేసుకుంటున్న దృశ్యం

సీఎం కార్యక్రమంలో భద్రతా లోపం

- సిద్దరామయ్య పాల్గొన్న వేదిక పైకి దూసుకెళ్లిన యువకుడు
- విధానసౌధ ప్రాంగణంలో ఘటన

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య పాల్గొన్న సభావేదిక పైకి ఓ యువకుడు దూసుకెళ్లడం కలకలం రేపింది. ఆదివారం అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక విధానసౌధ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప మాట్లాడుతుండగా.. ఓ యువకుడు ఒక్కసారిగా వేదిక పైకి దూసుకువచ్చాడు. కన్నడ కండువా వేసుకున్న ఆ యువకుడు ఓ శాలువాను సీఎంపైకి విసరగా, ఆయన పక్కన ఉన్న వారిపై పడింది. ఆ యువకుడిని బెంగళూరులోని కనకపురకు చెందిన మహదేవ నాయక్‌గా గుర్తించి, కేసు నమోదు చేశారు. అతను పలు ప్రశ్నలు వేస్తూ నినాదాలు చేశాడు. ఆ యువకుడు ఏం చెప్పదలచుకున్నాడనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సీఎం పాల్గొన్న సభలో భద్రతా వైఫల్యంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలోనూ సీఎం సిద్దరామయ్య పాల్గొన్న రోడ్‌షోలో తుపాకి కలిగిన వ్యక్తి కనిపించడం చర్చకు దారితీసింది. బెంగళూరులో ఇటీవలే రామేశ్వరం కెఫెలో బాంబు పేలుడు జరిగిన విషయం తెలిసిందే. ఆ తర్వాత విధానసౌధ ప్రాంగణంలో పాకిస్థాన్ జిందాబాద్ అంటూ నినాదాలు చేయడం సంచలనమైంది. ఇలా తరచూ భద్రతా వైఫల్యాలు వెలుగులోకి వస్తుండడంతో సర్వత్రా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.





వేదికపై సీఎం పక్కన పడిన కండువా, యువకుడిని అదుపులోకి తీసుకుంటున్న భద్రతా సిబ్బంది

పరప్పన జైలుపై సీసీబీ దాడి

- 18 మొబైల్ ఫోన్లు, డ్రగ్స్, నగదు స్వాధీనం

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పరప్పన అగ్రహార సెంట్రల్ జైలుపై సీసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. విల్సన్ గార్డెన్ నాగతో పాటు అతని సహచరుల నుంచి 18 మొబైల్ ఫోన్లు, డ్రగ్స్, నగదు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. సీసీబీ అధికారులు శనివారం దాడి చేసినట్టు ప్రకటించారు. నగర పోలీస్ కమిషనర్ దయానంద్ సూచన మేరకు దాడి జరిగినట్టు తెలుస్తోంది. ఆగస్టు 24న సీసీబీ అధికారులు పరప్పన జైలుపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఆ మరుసటి రోజే దర్శన్ జైలులో కాఫీ సేవిస్తూ, సిగరెట్ తాగుతూ నలుగురితో కలిసి కుర్చీలో కూర్చున్న ఫొటో వైరల్ అయింది. ఇలా తరచూ జైలుపై దాడులు చేస్తూ అక్రమాలను నివారించవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఇందులో భాగంగానే దాడులు చేసినట్టు పోలీసు అధికారులు తెలిపారు.

ఎమ్మెల్యే మునిరత్నకు రెండు రోజుల పోలీస్ కస్టడీ

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కులం పేరుతో దూషించారని, కంట్రాక్టర్ నుంచి లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలతో బెంగళూరు రాజరాజేశ్వరినగర్ బీజేపీ ఎమ్మెల్యే మునిరత్నకు రెండు రోజుల పోలీస్ కస్టడీ విధించారు. శనివారం సాయంత్రం కోలారు జిల్లా ముళబాగిలు సమీపాన ఆయన్ను అదుపులోకి తీసుకున్న పోలీసులు రాత్రి బెంగళూరుకు తీసుకొచ్చారు. ఆదివారం వైద్య పరీక్షలు నిర్వహించి, న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు. వారం రోజుల కస్టడీకి పోలీసులు కోరగా.. న్యాయమూర్తి రెండు రోజులకు అనుమతించారు. కాగా మునిరత్నపై చర్యల వెనుక రాజకీయ వేధింపులు లేవని మంత్రి లక్ష్మి హెబ్బాళ్కర్ సహా పలువురు వ్యాఖ్యానించారు. మరోమంత్రి సతీశ్ జార్కిహోళి మాట్లాడుతూ.. కులదూషణలు చేయమని తామేమైనా సూచించామా అంటూ ప్రశ్నించారు. ప్రతిపక్షనేత అశోక్ బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ.. హోం మంత్రి పరమేశ్వర్ కుట్రపన్ని మునిరత్నను అరెస్టు చేయించారని మండిపడ్డారు.

పాలస్తీనా జెండాతో యువకుల హల్‌చల్

తుమకూరు జిల్లా కుణిగల్‌లో పాలస్తీనా జెండా ఆవిష్కరించేందుకు గత నెల 15న ప్రయత్నించిన ఘటన మరువకముందే చిక్కమగళూరులో పాలస్తీనా జెండాతో ద్విచక్రవాహనంపై ముగ్గురు యువకులు హల్‌చల్ చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. ఆదివారం చిక్కమగళూరు నగరంలోని ప్రధాన వీధుల్లో ఒకే వాహనంపై ముగ్గురు యువకులు పాలస్తీనా జెండాతో చక్కర్లు కొట్టారు. ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్ కావడంతో హిందూ కార్యకర్తలు చిక్కమగళూరు నగర పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు.



అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం ంరాచపల్లి కూడలి వద్ద ఏలేరు కాలువ గండి పూడ్చివేత పనులు

ఏలేరు కాలువకు గండి

- వెంటనే స్పందించిన జీవీఎంసీ అధికారులు.. గండి పూడ్చివేత

మాకవరపాలెం (అనకాపల్లి జిల్లా), సెప్టెంబరు 15: కాకినాడ జిల్లా ఏలేరు రిజర్వాయర్ నుంచి విశాఖ నగరానికి తాగునీరు సరఫరా చేసే కాలువకు గండి పడింది. అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం రాచపల్లి కూడలికి సమీపంలో 99.6 కిలోమీటరు వద్ద ఆదివారం ఉదయం సుమారు పది మీటర్ల వెడల్పున భారీ గండిపడింది. అయితే పక్కనే జాగారాల గెడ్డ ఉండడంతో, నీరంతా దానిలోకి ప్రవహించడంతో పంట పొలాలు ముంపుబారిన పడలేదు. సమాచారం అందుకున్న మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) అధికారులు వెంటనే స్పందించారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్లను రప్పించి ఇసుక బస్తాలు, సరుగుడు కర్రలతో గండి పూడ్చివేత పనులు చేపట్టారు. కాగా, ఈ ప్రదేశంలో గతంలో కూడా పలుమార్లు గండ్లు పడినట్టు స్థానికులు చెబుతున్నారు. మాకవరపాలెం మండలంలో పలుచోట్ల ఏలేరు కాలువ గట్లు బలహీనంగా ఉన్నాయని, గండ్లు పడే ప్రమాదం ఉన్నందున వీటిని పటిష్ఠం చేయాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

అమెరికా ఎన్నికల ర్యాలీలో డీకే శివకుమార్

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమెరికా ఎన్నికల ర్యాలీలో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పాల్గొన్నారు. యూఎస్ పర్యటనలో ఉన్న ఆయన శనివారం ఎన్నికల ర్యాలీని వీక్షించే అద్భుత అవకాశం లభించిందని 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఇక్కడ ఎన్నికల ర్యాలీని చూసినపుడు ఎంతో నేర్చుకోవాలని అనిపించిందని పేర్కొన్నారు. ప్రజాశక్తి, ఉత్సాహం స్ఫూర్తిదాయకంగా ఉన్నాయన్నారు. ఈ మహత్తరమైన కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా మరిన్ని విషయాలు నేర్చుకోవాలని ఎదురుచూస్తున్నానని తెలిపారు. డీకే శివకుమార్ ఈ నెల 8న అమెరికా పర్యటనకు వెళ్లారు.

మిత్రులతో గడపాలని భర్త వేధింపులు

- ససేమిరా అన్నందుకు దారుణహత్య

బెంగళూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తన మిత్రులతో గడపాలని, అంతవరకు తాకేది లేదని భార్యను వేధించినా ఆమె ససేమిరా అనడంతో దారుణంగా హత్యచేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యాదగిరి జిల్లా శెహపుర తాలూకా గంగనాళ గ్రామానికి చెందిన శరణ బసమ్మ (25) జూలైలో హత్యకు గురికాగా.. పోలీసులు ఈ కేసును తాజాగా ఛేదించారు. శరణబసమ్మకు హుణసగి గ్రామక్యాంపులో నివసించే భీమణ్ణ (32)తో 14 నెలల క్రితం వివాహమైంది. మూడు నెలలపాటు అన్యోన్యంగా గడిపారు. ఆ తర్వాత 'నిన్ను తాకాలంటే నా మిత్రులతో గడపాలి' అని ఆమెను భీమణ్ణ వేధించేవాడు. జూలైలో భార్యతో పాటు ఆమె పుట్టినిల్లు గంగనాళ గ్రామానికి వెళ్లిన భీమణ్ణ తలగడతో ఊపిరి ఆడకుండా చేసి శరణ బసమ్మను హత్యచేశాడు. స్పృహ కోల్పోయిందంటూ బంధువులతో కలిసి ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లగా.. మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. కాగా ఆమె మృతి అసహజంగా ఉందని వైద్యులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆమె మృతికి సంబంధించి ఫోరెన్సిక్ నివేదిక ఇటీవల రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. సొంతూరిలో హత్యచేస్తే పట్టుబడతానని, పుట్టింటిలోనే భార్యను చంపి ఆ తర్వాత ఏమీ తెలియనివాడిలా నటించాడు. చివరకు ఫోరెన్సిక్ నివేదికలో గొంతు నులమడంతో ఊపిరి ఆగినట్టు తేలడంతో భీమణ్ణను పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించడంతో హత్య చేసినట్టు అంగీకరించాడు. ఈ మేరకు గోగి పోలీసులు ఏడుగురిపై కేసు నమోదు చేశారు.

3 ఏళ్లు.. 5 వేల వీసాలు.. రూ. 300 కోట్లు

- ఢిల్లీలో నకిలీ వీసా రాకెట్ గుట్టు రట్టు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: దేశ రాజధాని ఢిల్లీలో పోలీసులు నకిలీ వీసాలు సృష్టిస్తున్న ముఠా ఆటలను కట్టించారు. హరియాణాకు చెందిన సందీప్ అనే వ్యక్తి స్వీడన్ వెళ్లేందుకు ఆదివారం ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఎయిర్‌పోర్టుకు వచ్చాడు. ఇమ్మిగ్రేషన్ చెక్‌లో సందీప్ వద్ద ఉంది నకిలీ వీసా అని అధికారులు గుర్తించి అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా తన ప్రాంతం నుంచి చాలా మంది ఇలాగే నకిలీ వీసాలతో విదేశాలకు వెళ్లినట్లు చెప్పాడు. తాను ఆసిఫ్ అలీ అనే ఏజెంట్‌కు రూ. 10లక్షలిచ్చి ఈ నకిలీ వీసాను పొందినట్లు చెప్పాడు. పోలీసులు ఆసిఫ్ అలీని అరెస్టు చేసి విచారించగా అతడు మరో ఇద్దరి పేర్లు చెప్పాడు. ఇలా మొత్తం ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. గ్రాఫిక్ డిజైనింగ్ వచ్చిన మనోజ్ మోంగా అనే వ్యక్తి ఈ ముఠాలో కీలక పాత్రను పోషిస్తున్నట్లు తెలుసుకున్నారు. అతను ఢిల్లీలోని తిలక్‌నగర్‌లో ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని అందులో యంత్రాలు పెట్టి వాటి ద్వారా నకిలీ వీసాలను రూపొందిస్తున్నట్లు పోలీసులు చెప్పారు. అతడు మూడేళ్లలో 5 వేలకు పైగా నకిలీ వీసాలు రూపొందించాడని, దానికి గాను రూ. 300 కోట్లు అర్జించాడని పోలీసులు తెలిపారు. ఒక నెలలో అతడు 30 నుంచి 60 నకిలీ వీసాలను తయారు చేస్తాడని, ఒక్కో వీసాను రూ. 8 నుంచి 10 లక్షలకు విక్రయిస్తాడని చెప్పారు. జైదీప్ సింగ్ అనే వ్యక్తి మనోజ్‌కు ఈ పని నేర్పించి యంత్రాలు సరఫరా చేసినట్లు తెలుసుకుని అతడిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.